1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 216 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 03 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 216 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 03 July 2025 PAGES : 8 PRICE : 3/-

## ఏడాది కాలంగా
# ఇదే మా పాలసీ

- కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన
- దేశంలోనే కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్పష్టీకరణ
- ఈ ఏడాదిలోనే కుప్పం చివరి ఆయకట్టుకు హంద్రీనీవా జలాలు
- స్వర్ణ కుప్పం ప్రాజెక్టు కింద రూ. 1292 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)**

తన నియోజకవర్గమైన కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. బుధవారం నాడు కుప్పంలో పర్యటించిన ఆయన, 'స్వర్ణ కుప్పం' ప్రాజెక్టులో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో మాట్లాడుతూ, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నామని స్పష్టం చేశారు.

కుప్పం నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన హంద్రీనీవా నీళ్లను ఈ ఏడాదిలోనే అందిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. రూ. 3,890 కోట్ల వ్యయంతో హంద్రీనీవా పనులను పూర్తి చేసి, నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారిస్తామని తెలిపారు. "అభివృద్ధి చేసే వారికే సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఉంటుంది. -మిగతా 2లో

## అంతరాలు తొలగించాం



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 02)**

ఉన్నవారికి, లేనివారికి మధ్యనున్న అంతరాలు తొలగించి దేశంలో అవకాశాలను ప్రజాస్వామ్యీకరించామని, ఇప్పుడిది ప్రజల ఉద్యమంగా రూపుదిద్దుకుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం చేపట్టి మంగళవారానికి సరిగ్గా పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన 'లింక్డ్ఇన్'లో సవివరంగా పోస్ట్‌పెట్టారు. "భారతీయులు సాంకేతికతను వాడగలరా, లేదా అనే సందేహంతోనే దశాబ్దాలు గడిచిపోయాయి. మా ప్రభుత్వం వచ్చాక ఈ ధోరణిని మార్చింది. అందరికీ అన్నీ అందుబాటులోకి తీసుకువచ్చి అవకాశాలు కల్పించింది. 2014లో దేశంలో 25 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు ఉంటే ఇప్పుడది 97 కోట్లు దాటింది. మారుమూల గ్రామాలనూ కలిపేలా 42 లక్షల కి.మీ. ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు వేశాం. అత్యంత వేగమైన 5జీని అందుబాటులో తెచ్చేందుకు 4.81 లక్షల బేస్ స్టేషన్లను రెండేళ్లలో అందుబాటులోకి తెచ్చాం. గల్వాన్, సియాచిన్, లద్దాఖ్‌లకూ ఇప్పుడు అధికవేగ ఇంటర్నెట్ చేరుతోంది. యూపీఐ వంటి వేదికల వల్ల ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో సగం మన దేశంలోనే జరుగుతున్నాయి. దళారుల ప్రమేయాన్ని తొలగించిన ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) వల్ల రూ.3.48 లక్షల కోట్ల డబ్బు ఆదా అయింది. ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్ ద్వారా సామాన్యులు -మిగతా 2లో

## ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి..

రైతులకు అండగా నిలుస్తాం: పవన్ కల్యాణ్

లక్ష వ్యవసాయ కుంటలను రైతులకు అందుబాటులోకి తెచ్చామన్న పవన్

రైతుల సహకారంతోనే ఇది సాధ్యమయిందని ప్రశంస



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)**

కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని వ్యాఖ్య రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఫామ్ పాండ్స్ -మిగతా 2లో

## ఏపీ వ్యాప్తంగా ఇంటింటికీ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభం

రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ వెళుతున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

ఏడాది పాలన, సూపర్ 6 అమలుపై ప్రజలకు ప్రత్యక్షంగా వివరణ

కూటమి పాలనలో వివక్ష లేకుండా పథకాలు అందుతున్నాయని ప్రజల హర్షం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తన పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి ప్రచారాన్ని పండగ వాతావరణంలో ప్రారంభించింది. ఏడాది కాలంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడమే ఈ కార్యక్రమం యొక్క -మిగతా 2లో



## మీ పిల్లల చదువుల బాధ్యత నాదీ..

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)**

తెదేపాకు నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు ఉన్నారని, అందుకే వైకాపా రాక్షస పాలనలో ధైర్యంగా పోరాడగలిగామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వైకాపా పాలనలో వేధింపులకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం ఆర్మేనిపాడు గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త షేక్ అల్లాబక్షును కుటుంబంతో సహా ఉండవల్లి నివాసానికి పిలిపించుకున్న లోకేశ్ వారితో మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా అల్లాబక్షు కుటుంబం తెదేపాకు సేవలందిస్తోంది. ప్రస్తుతం ఆయన మండల మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. వైకాపా దాష్టీకాలకు ఎదురొడ్డి 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను నిలబెట్టారు. దీంతో అల్లాబక్షుకు చెందిన 3.5 ఎకరాల్లో జామాయిల్ తోటను వైకాపా మూకలు నరికివేశాయి. ఆ భూమిని కక్షతో నిషేధిత భూముల జాబితా 22ఏలో చేర్చారు. -మిగతా 2లో



## నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం... దేశం దాటిస్తాం: ట్రంప్


దేశంలో పుట్టినవారికైనా, పౌరసత్వం పొందినవారికైనా ఇది వర్తిస్తుందని వ్యాఖ్య

దీనిపై చట్టపరమైన స్పష్టత లేదని స్వయంగా అంగీకారం

ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని న్యాయ నిపుణుల హెచ్చరిక

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 02)**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తీవ్రమైన నేరాలకు పాల్పడే అమెరికా పౌరులను కూడా దేశం నుంచి బహిష్కరించాలనే కొత్త ఆలోచనను ఆయన తాజాగా బయటపెట్టారు. అయితే, ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



ఫ్లోరిడా ఎవర్గ్లేడ్స్‌లోని వలసదారుల నిర్బంధ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. అమెరికా పౌరసత్వం పొందిన కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని -మిగతా 2లో

## రెండు సంవత్సరాల్లో 3.5 కోట్ల ఉద్యోగాలు

దేశంలో ఉపాధి కల్పనకు భారీ ప్రోత్సాహక పథకం

రూ.99,446 కోట్లతో ఈఎల్ఐ

కేంద్ర క్యాబినెట్ ఆమోదం

ప్రైవేటు రంగంలో పరిశోధనలకు రూ.లక్ష కోట్లతో సంచిత నిధి

2036 ఒలింపిక్స్ లక్ష్యంగా నూతన 'జాతీయ క్రీడా విధానం'...

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)**

దేశంలో భారీ సంఖ్యలో ఉద్యోగాల సృష్టితో పాటు ప్రైవేటు రంగంలో పరిశోధనలు, నవ్యావిష్కరణల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రపంచ స్థాయి శిక్షణలను క్రీడాకారులకు సమకూర్చడం, సంబంధిత పాలనా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా -మిగతా 2లో



## నాకు ఇంకో దారి లేదు: 'సీఎం పదవి'పై డీకే ఆసక్తికర వ్యాఖ్యలు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)**

కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై కొన్ని రోజులుగా వినిపిస్తోన్న వ్యాఖ్యలకు చెక్ పడింది. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేశారు. "నేను సీఎంగా కొనసాగుతా. మీకెందుకు అలాంటి అనుమానాలు ఉన్నాయి..?" అని బుధవారం పాత్రికేయులకు వెల్లడించారు. సీఎం మార్పు గురించి విపక్ష పార్టీలు భాజపా, జేడీఎస్ చేస్తోన్న వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వారేమైనా కాంగ్రెస్ అధిష్ఠానమా అని ప్రశ్నించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ..' ఆయన(సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలి" అని మాట్లాడారు.ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి -మిగతా 2లో



## రష్యాతో వ్యాపారం చేస్తే.. భారత్‌పై 500% సుంకం: అమెరికా

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 02)**

రష్యా తో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తే భారత్ , చైనా లపై 500 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా హెచ్చరించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుతో యూఎస్ సెనేట్‌లో దీనిపై బిల్లు తెస్తామని తెలిపింది. రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం విధిస్తాం. ఆ దేశం నుంచి చమురును భారత్, చైనాలు 70శాతం కొనుగోలు చేస్తున్నాయి' అని లిండ్సే పేర్కొన్నారు. ఆగస్టులో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ బిల్లుపై ట్రంప్ కూడా ఓకే చెప్పారని వెల్లడించారు. రష్యాను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసే యూఎస్ ప్రయత్నాల్లో ఇది ఒకటిగా తెలుస్తోంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే.. రష్యా నుంచి పెద్దమొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది మన ఔషధాలు, వస్త్రాలు -మిగతా 2లో



## ఒక చేత్తో భాజపా జెండా.. మరో చేత్తో కూటమి ఎజెండా

రాష్ట్రంలో భాజపాను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతా

పార్టీ వైభవం, ప్రభుత్వ గొప్పతనం ప్రజల్లోకి తీసుకెళదాం

భాజపా ఏపీ శాఖ నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)**

ఆంధ్రప్రదేశ్‌లో భాజపాను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని, పార్టీ కార్యకర్తలు గర్వపడేలా బలోపేతం చేస్తానని భాజపా ఆంధ్రప్రదేశ్ శాఖ నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. భాజపా ఆంధ్రప్రదేశ్ సంఘటన్ పర్వ్ రాష్ట్ర అధ్యక్ష, జాతీయ మండలి సభ్యుల ఎన్నికల వేడుక విజయవాడలో మంగళవారం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడిగా మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల పరిశీలకుడు పీసీ మోహన్ ప్రకటించారు. జాతీయ మండలి సభ్యులుగా ఎన్నికైన వారి వివరాలు వెల్లడించారు. పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి పాకా వెంకట సత్యనారాయణ ధ్రువీకరణ పత్రాన్ని మాధవ్‌కు అందించారు. అనంతరం దగ్గుబాటి పురందేశ్వరి నుంచి మాధవ్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి హోదాలో మాధవ్ మాట్లాడారు. "ఒక చేత్తో భాజపా జెండా.. మరో చేత్తో కూటమి ఎజెండాను రాష్ట్రంలో పారదర్శకంగా తీసుకెళ్లాలి. గత ప్రభుత్వ ఐదేళ్ల నిరంకుశ పరిపాలనకు ప్రజలు చరమ గీతం పాడి.. 11 సీట్లకే పరిమితం చేశారు. కూటమిపై ప్రజలు ఉంచిన విశ్వాసం నిలబెట్టుకునేలా కలిసికట్టుగా కృషిచేయాలి. అధ్యక్ష పదవి అంటే -మిగతా 2లో

# అంతరాలు తొలగించాం

సయితం దేశం నలుమూలలా తమ సరకుల్ని, సేవల్ని విక్రయించగలుగుతున్నారు. రాబోయే దశాబ్దిలో ఇంకా ముందుకు దూసుకువెళ్లి ప్రపంచంపై మనదైన ముద్ర వేయబోతున్నాం" అని ప్రధాని చెప్పారు.

హామీలు నెరవేరలేదన్న కాంగ్రెస్

డిజిటల్ ఇండియా హామీలను సర్కారు నెరవేర్చలేకపోయిందని కాంగ్రెస్ విమర్శించింది. ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పినా అవన్నీ శుష్క వాగ్దానాలుగానే మిగిలాయని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్' వేదికగా స్పందించారు. 65% గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులోకి రాలేదని, ప్రభుత్వరంగ టెలికాం కంపెనీల రుణభారం పెరిగిపోతోందని, సైబర్ నేరాలకు అంతే లేదని చెప్పారు. వీటికి సంబంధించిన గణాంకాలను వివరించారు. ఆధార్, యూపీఐలకు పునాదులు కాంగ్రెస్ పాలనలోనే పడ్డాయన్నారు.

# ఏడాది కాలంగా ఇదే మా పాలసీ

అప్పులు తెచ్చి సంక్షేమం చేస్తామనడం సరైన పరిపాలన కాదు," అని ఆయన అన్నారు. అభివృద్ధి ద్వారా ఆదాయాన్ని సృష్టించి, దానిని సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడమే సరైన ఆర్థిక విధానమని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం గత ఏడాదిగా ఇదే పాలసీని అనుసరిస్తోందని వివరించారు.

'స్వర్ణ కుప్పం' ప్రాజెక్టు కింద నియోజకవర్గంలో మొత్తం రూ. 1292 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే రూ. 125 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నియోజకవర్గంలోని రహదారులన్నింటినీ సీసీ, బీటీ రోడ్లుగా మార్చనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా గుంతలు లేని రహదారులను నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతోనే ఏడాదిగా సుపరిపాలన అందిస్తున్నామని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా మహిళల కోసం 'దీపం 2.0' పథకాన్ని ప్రస్తావించారు. గతంలో తాము ప్రవేశపెట్టిన 'దీపం' పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందిస్తే, ఇప్పుడు 'దీపం 2.0' ద్వారా అర్హులైన మహిళలందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల కుప్పం నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలోనూ వంట గ్యాస్ అందుబాటులోకి వచ్చిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. సుపరిపాలనలో భాగంగానే ప్రజల ముందుకు వచ్చానని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

## ఏపీ వ్యాప్తంగా ఇంటింటికీ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభం

ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు, పరిటాల సునీత, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటినీ సందర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న 'సూపర్ 6' హామీల పురోగతిని ప్రజలకు వివరిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు, కీలక ప్రాజెక్టుల వివరాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడమే కాకుండా, ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు కూడా స్వీకరిస్తున్నారు.

ఈ సందర్భంగా పలువురు ప్రజలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలులో వివక్షను ఎదుర్కొన్నామని, కానీ ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో 'సూపర్ 6' పథకాలు ఎలాంటి పక్షపాతం లేకుండా అందరికీ సమానంగా అందుతున్నాయని వారు హర్షం వ్యక్తం చేసినట్లు నాయకులు తెలిపారు.

ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన పనులను ప్రజల ముందు ఉంచడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై కూడా ఈ ప్రచారంలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రజా భాగస్వామ్యంతో పాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చే దిశగా ఈ కార్యక్రమం దోహదపడుతుందని కూటమి నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మీ పిల్లల చదువుల బాధ్యత నాదీ..

ఇంటి గోడను కూల్చి భయభ్రాంతులకు గురిచేశారు. ఈ సందర్భంగా తన కుమార్తెల చదువుకు సాయం అందించాలని, తన భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని మంత్రికి అల్లాబక్షు విజ్ఞప్తి చేశారు. ఇద్దరు పిల్లలను చదివించే బాధ్యత తాను తీసుకుంటానని, సొంత పిల్లల్లా చూసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు.

## నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం... దేశం దాటిస్తాం: ట్రంప్

ఆయన ఆరోపించారు. "వారు మన దేశానికి కొత్త కాదు, చాలా కాలంగా ఇక్కడే ఉంటున్నారు. వారిలో చాలామంది ఇక్కడే పుట్టారు. నిజం చెప్పాలంటే, వాళ్లను కూడా ఇక్కడి నుంచి తరిమికొట్టాలని నేను భావిస్తున్నాను. బహుశా ఇదే మా తదుపరి పని కావచ్చు" అని ఏబీసీ న్యూస్ కథనం ప్రకారం ట్రంప్ వ్యాఖ్యానించారు.అయితే, తన ప్రతిపాదనకు చట్టపరమైన వెసులుబాటు ఉందో లేదో తనకు కచ్చితంగా తెలియదని ట్రంప్ అంగీకరించడం గమనార్హం. "చట్టపరంగా మాకు ఆ హక్కు ఉందో లేదో తెలుసుకోవాలి.

## మొదటి పేజీ తరువాయి

ఒకవేళ ఆ అధికారం ఉంటే మాత్రం, ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆ పని చేస్తాను. ప్రస్తుతం దానిపైనే మేం దృష్టి సారించాం" అని ఆయన స్పష్టం చేశారు.ట్రంప్ వ్యాఖ్యలకు కొన్ని వారాల ముందే, ఆయన నియమించిన సహాయ అటార్నీ జనరల్ బ్రెట్ షుమేట్ ఒక మెమో జారీ చేశారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఉన్న కేసుల్లో పౌరసత్వం రద్దు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన యూఎస్ అటార్నీలను ప్రోత్సహించారు. ముఖ్యంగా వేధింపులు, యుద్ధ నేరాలు, మానవ అక్రమ రవాణా, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని లక్ష్యంగా చేసుకోవాలని ఆ మెమోలో పేర్కొన్నారు.

మరోవైపు, నేరాలకు పాల్పడ్డారనే కారణంతో, అమెరికా గడ్డపై సహజంగా జన్మించిన లేదా సహజ పౌరసత్వం పొందిన వారిని దేశం నుంచి బహిష్కరించడం రాజ్యాంగంలోని ఎనిమిదో సవరణను ఉల్లంఘించడమే అవుతుందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రూరమైన, అసాధారణ శిక్షలను ఈ సవరణ నిషేధిస్తుందని వారు గుర్తు చేస్తున్నారు.

వర్జీనియా యూనివర్సిటీకి చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ అమండా ఫ్రాస్ట్ మాట్లాడుతూ, "పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసానికి పాల్పడటం లేదా దేశద్రోహం వంటి నిర్దిష్ట సందర్భాల్లో మాత్రమే సహజ పౌరుల హోదాను రద్దు చేయగలరు. అంతేకానీ, సంబంధం లేని నేరాలను కారణంగా చూపి ఒకరి పౌరసత్వాన్ని రద్దు చేసి, వారిని దేశం నుంచి బహిష్కరించడం కుదరదు" అని ఏబీసీ న్యూస్‌కు వివరించారు. ట్రంప్ సందర్శించిన ఈ నిర్బంధ కేంద్రాన్ని, కఠిన వలస విధానాల కారణంగా విమర్శకులు 'అలిగేటర్ అల్కాట్రాజ్' అని పిలుస్తుండగా, ట్రంప్ మాత్రం ఆ వివాదాన్ని పట్టించుకోకుండా తన పర్యటనను పూర్తి చేశారు.

# రెండు సంవత్సరాల్లో 3.5 కోట్ల ఉద్యోగాలు

నూతన జాతీయ క్రీడా విధానం (ఖేలో భారత్ నీతి)-2025కి ఆమోదం తెలిపింది.

2036లో ఒలింపిక్ క్రీడల నిర్వహణ మన దేశానికి దక్కేలా చేసుకోవడానికి 'వ్యూహాత్మక మార్గసూచీ'ని ప్రకటించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన మంగళవారం దిల్లీలో కేంద్ర క్యాబినెట్ సమావేశమై తీసుకున్న నిర్ణయాలను సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. కేంద్ర బడ్జెట్ 2024-25లో ప్రకటించిన ఉపాధి అనుసంధాన ప్రోత్సాహక (ఈఎల్ఐ) పథకం అమలుకు తాజాగా రూ.99,446 కోట్లు వెచ్చించడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. వచ్చే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా నిర్ణయించింది. వీరిలో 1.92 కోట్ల మంది తొలిసారి ఉద్యోగాల్లోకి ప్రవేశిస్తారని అంచనా. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జులై 31 వరకు ఉద్యోగాలు కల్పించిన యాజమాన్యాలకు, కొత్త ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందుతాయి. ఈ పథకాన్ని రెండు భాగాలుగా అమలుచేస్తారు.

పార్ట్-ఎ (తొలిసారి ఉద్యోగంలో చేరిన వారికి): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ...ఈపీఎఫ్‌ఓలో తొలిసారి నమోదైన వారిని దృష్టిలో ఉంచుకొని ఈ పథకం అమలుచేస్తారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి రూ.15వేల మొత్తాన్ని రెండు వాయిదాల్లో చెల్లిస్తారు. రూ.లక్ష వరకు వేతనం పొందే ఉద్యోగులు అర్హులు.

పార్ట్-బి (యజమానులకు ఆర్థిక సాయం): ఇప్పటికే ఉన్న ఉద్యోగులకు అదనంగా కొలువులు కల్పించే యాజమాన్యాలకు ఈఎల్ఐ పథకం కింద ఆర్థికసాయం అందిస్తారు. ముఖ్యంగా తయారీ రంగాన్ని దృష్టిలో ఉంచుకొని దీన్ని రూపొందించారు. సంస్థలో ఇప్పుడున్న సిబ్బందికి అదనంగా ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తే అంతమందికి నెలకు రూ.3వేల చొప్పున రెండేళ్ల పాటు యజమానులకు ప్రభుత్వం చెల్లిస్తుంది. రూ.లక్ష వరకు జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం ఈ మొత్తాన్ని చెల్లిస్తుంది. అయితే, అదనంగా చేరిన ఉద్యోగులు కనీసం 6నెలలు అదే సంస్థలో పని చేయాలి. ఈపీఎఫ్‌ఓలో నమోదైన సంస్థలకు మాత్రమే ఇది వర్తిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

### పరిశోధన, అభివృద్ధి, నవకల్పన పథకం

దేశంలో ప్రైవేటు రంగంలో పరిశోధన రంగాన్ని ప్రోత్సహించడానికి రూ.లక్ష కోట్లతో సంచిత నిధి (కార్పస్‌ఫండ్)ని కేంద్ర మంత్రి మండలి ప్రకటించింది. దీని కోసం పరిశోధన, అభివృద్ధి, నవకల్పనల పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. పరిశోధన ప్రాజెక్టులకు దీర్ఘకాల రుణం కింద అతితక్కువ వడ్డీకీ, లేదంటే వడ్డీ లేకుండానే నిధులు అందించే ఏర్పాట్లు దీనిలో ఉన్నాయి. ప్రపంచ క్రీడా రంగంలో భారత్ ఐదో అగ్రస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో రూపొందించిన జాతీయ క్రీడా విధానం (ఖేలో భారత్ నీతి)-2025కి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. 2036 ఒలింపిక్ క్రీడల నిర్వహణ బిడ్డింగ్‌ను దక్కించుకునే లక్ష్యంతో తీసుకొచ్చారు.

## నాకు ఇంకో దారి లేదు: 'సీఎం పదవి'పై డీకే ఆసక్తికర వ్యాఖ్యలు

డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం పార్టీ అధిష్ఠానం శివకుమార్ గురించే మాట్లాడుతోందన్నారు. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో 'విప్లవాత్మక' పరిణామాలు నెలకొంటాయని కర్ణాటక మంత్రి కె.ఎన్.రాజన్న కూడా ఇటీవల పేర్కొన్నారు. దీంతో త్వరలోనే నాయకత్వ మార్పు తథ్యమని అధికార పార్టీలోనూ విస్తృత చర్చ నడిచింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారనే వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. శివకుమార్ కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తాననే బహిరంగంగానే చెబుతున్నారు. ఆ నేపథ్యమూ ఈ చర్చకు దారితీసింది.అయితే వ్యాఖ్యలను డీకే శివకుమార్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇప్పటికే ఖండించిన సంగతి తెలిసిందే. "నా తరఫున ఎమ్మెల్యేలు మాట్లాడాలని కోరుకోవడం లేదు. 2028లో రాష్ట్రంలో జరిగే ఎన్నికల పైనే నేతల దృష్టి ఉండాలి. నేను తొలుత పార్టీ కార్యకర్తను. అన్నింటికంటే పార్టీనే ముఖ్యం" అని డీకే స్పష్టంచేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని సూర్జేవాలా వెల్లడించారు. ఈ ఊహాగానాల వెనక భాజపా కుట్ర ఉందని విమర్శించారు.

## రష్యాతో వ్యాపారం చేస్తే.. భారత్‌పై 500% సుంకం: అమెరికా

వంటి ఎగుమతులపై ప్రభావం పడుతుంది. ఇక, ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే దేశాల కోసం లిండ్సే మరో ఒప్పందాన్ని ప్రతిపాదించనున్నట్లు తెలుస్తోంది.

తక్కువ సుంకాలతో భారత్‌తో డీల్..

భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరనుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. చాలా తక్కువ సుంకాలతోనే ఈ డీల్ ఉండనున్నట్లు తెలిపారు. 'త్వరలోనే భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నాం. అది ఒక కొత్త డీల్ అవుతుంది. ప్రస్తుతం భారత్ ఇంకా దాన్ని అంగీకరించలేదు. వాళ్లు డీల్‌కు ఒప్పుకుంటే తక్కువ సుంకాలు విధించేలా ఒప్పందం కుదురుతుంది' అని అధ్యక్షుడు పేర్కొన్నారు. జులై 9 కల్లా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరుదేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే దీనిపై చర్చలు కూడా జరుపుతున్నాయి.

## ఒక చేత్తో భాజపా జెండా.. మరో చేత్తో కూటమి ఎజెండా

గొప్ప స్థానం కాదు. అదొక బాధ్యత. పార్టీ కోసం ఎంతోమంది పనిచేస్తున్నా నా మీద నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళదాం. నరేంద్ర మోదీ రాష్ట్రానికి చేస్తున్న సాయం ప్రజలకు వివరిద్దాం. మన అందరికీ రాష్ట్రమంటే అభిమానంతోపాటు జాతీయ స్ఫూర్తి ఉండాలి. మన ప్రాంతంలోని సౌకర్యాలు, సంపద, సంస్కృతికి పునరుజ్జీవం పోయాలి. గుజరాత్‌ను మించి సంపద సృష్టించగలిగే ప్రాంతం ఆంధ్ర.. అమరావతిని స్థిర రాజధానిగా చేసుకోవాలి. రాష్ట్ర నిర్మాణంలో అందరం భాగస్వాములు కావాలి. తెలుగు భాషకు మించిన భాష ప్రపంచంలో లేదు. ప్రభుత్వాలు మన భాషను ప్రోత్సహించడంలో వెనకబడుతున్నాయి. గత ప్రభుత్వం తెలుగును విస్మరించింది. తెలుగు భాష ఉన్నతి కోసం భాజపా శ్రమిస్తుంది" అని మాధవ్ అన్నారు. రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మాధవ్‌కు పార్టీ కోసం రాష్ట్రమంతా తిరిగే అవకాశం ఇవ్వాలని ఆయన సతీమణి మాధురిని పలువురు నేతలు తమ ప్రసంగాల్లో కోరారు. దీంతో నవ్వులు విరిశాయి. మాధవ్ సతీమణి, పిల్లలను వేదికపైకి రమ్మని నేతలు కోరగా ఆమె సున్నితంగా తిరస్కరించారు. వేదిక కింద నుంచే పిల్లలతో కలిసి కార్యకర్తలకు అభివాదం చేశారు. వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ సీఎం రమేష్, భాజపా నాయకులు సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహారావు, విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణరెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పార్థసారథి, జకియా ఖానం, అంబికా కృష్ణ, లంకా దినకర్, సన్నారెడ్డి దయాకర్, యామినీశర్మ పాల్గొన్నారు.

## ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి..

(వ్యవసాయ కుంటలు) నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు.ఈ వ్యవసాయ కుంటలు కరవు పరిస్థితుల్లో కూడా రైతులకు ఆసరాగా నిలుస్తాయని పవన్ పేర్కొన్నారు. వీటి నిర్మాణం ద్వారా నిస్సారమైన భూములకు సైతం జీవం పోయవచ్చని, భూగర్భ జలాల మట్టం పెరగడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ ఫామ్ పాండ్స్ వల్ల ఇప్పటివరకు సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరిగిందని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించినట్టు అయిందని ఆయన తెలిపారు.

రైతుల సహకారంతోనే ఈ బృహత్కార్యం సాధ్యమైందని పవన్ అన్నారు. వ్యవసాయ కుంటల ఆవశ్యకతను గ్రహించి, తమ పొలాల్లో వాటిని తవ్వించుకోవడానికి ముందుకు వచ్చిన రైతులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, ఈ యజ్ఞంలో పాలుపంచుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి మొదలుకొని క్షేత్రస్థాయి సహాయకుల వరకు సిబ్బందికి, ఉపాధి హామీ కూలీలకు ఆయన పేరుపేరునా అభినందనలు తెలియజేశారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని పవన్ పేర్కొన్నారు. ఇందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు తెలియజేశారు.

# ఇసుక అక్రమ తవ్వకాల పై విచారణకు కలెక్టర్ ఆదేశం

### వాన్ పిక్ భూములను పరిశీలించిన ఆర్డిఓ, డిఎస్పి

### మైనింగ్ అధికారుల పై ఫిర్యాదులు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 2)**

ఎట్టకేలకు రెవిన్యూ పోలీస్ యంత్రాంగంలో కదలిక వచ్చింది. వరుస మీడియా వార్తా కథనాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం ఉదయం చీరాల ఆర్‌డిఓ టి చంద్రశేఖర్ నాయుడు, చీరాల డీయస్పీ యండి మొయిన్ వేటపాలెం మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలించారు. వేటపాలెం మండలం పుల్లరి పాలెం పంచాయితీ సర్వే నెంబరు 179 నందు వాన్ పిక్ భూములలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలించారు. అనంతరం దేశాయిపేట పంచాయతీ పరిధిలో రైల్వే గేట్ సమీపంలో 22/2 పట్టా భూములలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలించారు. ఇసుక తవ్వకాల పూర్తి వివరాలను స్థానిక వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మీడియాతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో ముఖ్యమైన ప్రదేశాలలో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేస్తున్నామని అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గత ఫిబ్రవరిలో అక్రమ క్వారీ నిర్వహణపై తనిఖీలు నిర్వహించిన జిల్లా మైనింగ్ అధికారులు, ఇప్పటి వేటపాలెం తహసిల్దార్ పి.పార్వతి క్వారీ నిర్వాహకుల ప్రలోభాలకు లొంగి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని స్థానికులు అధికారులకు తెలిపారు. వేటపాలెం మండలంలో అడ్డగోలుగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ జిల్లా మైనింగ్ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆర్డీవో కు ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు, ఇసుక అక్రమ తవ్వకాలను రవాణాను పూర్తిస్థాయిలో అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల రూరల్ సీఐ పి శేషగిరిరావు, వేటపాలెం ఎస్ఐ జనార్ధన్, వీఆర్వోలు పురుషోత్తం, కృష్ణవేణి, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# లబ్ధిదారులు ప్రతి ఒక్కరు కచ్చితంగా ఆధార్ కార్డు కలిగి ఉండాలి




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)**

ప్రభుత్వం అందించే పథకాల యొక్క లబ్ధిదారులు ప్రతి ఒక్కరు కచ్చితంగా ఆధార్ కార్డు కలిగి ఉండాలని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సంస్థ వారి ఆదేశాల ప్రకారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారం ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఆధార్ కార్డు లేని ప్రత్యేకంగా ఆధార్ కార్డు లో నమోదు అయ్యేవిధంగా సాతి కమిటీ ద్వారా న్యాయవాదులు,న్యాయ సేవా సహాయకులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ఆధార్ కార్డు లేని డస్టిట్యూట్ చిల్డ్రన్ ఉపయోగించుకోవాలని జిల్లా న్యాయశాఖ సేవాధికార సంస్థ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. ఒంగోలు పట్టణంలోని సంతపేటలో గల ఆధార్ నమోదు కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ సువర్ణ, మండల తాసిల్దార్ పిన్నిక మధుసూదన్‌రావుకి తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిల్లల సంరక్షణ అధికారి డి దినేష్, న్యాయవాదులు నూకతోటి రవికుమార్, ఏ రామసుబ్బయ్య, బచ్చు రాజేష్, వి గ్రేస్ కుమారి, న్యాయ సేవా నాయకులు పి సతీష్, పి శ్రీనివాసరావు, ఎస్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం



# డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

### పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే, జనసేన ఇన్‌ఛార్జి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 2)

ఈ నెల 4వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ 1290 కోట్ల రూపాయలతో ఇంటింటికి పైపులైన్ శంకుస్థాపన (తరువాయి 5లో...)

# ప్రజల ఆశయాలకు తోడు





కలెక్టర్
మురళి ఏడాది సేవా యానం
ఏడాది పాలనలో చెరగని ముద్ర
ప్రజల మనసులను చొరగొన్న కలెక్టర్ వెంకట మురళి
విధుల పట్ల అంకితభవం..
పాలనలో నిబద్ధతకు నిదర్శనం
నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాను అగ్రస్థానంలో
నిలిపేందుకు కలెక్టర్ ప్రయత్నాలు
వరదల వేళ కలెక్టర్ స్పందన అద్భుతం..
పి-4 లో రాష్ట్రం లోనే ప్రథమం
తరతరాలు పేదరికంలో ఉన్న గిరిజనులకు ప్రభుత్వ ఫలాలు
ఎస్టీల ఆధార్ నమోదుకు శ్రీకారం
గిరిజనులు- దివ్యాంగుల కొరకు ప్రత్యేక గ్రీవెన్స్
చీరాల కుప్పడం పట్టు చీరలకు
జాతీయస్థాయి గుర్తింపులో కలెక్టర్ పాత్ర
గవర్నర్ చేతుల మీదుగా బంగారం
పతకం అందుకున్న వెంకట మురళి
బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఏడాది
పాలనపై ప్రత్యేక కథనం

(షణ్ముఖ వెలుగు బ్యూరో, బాపట్ల, జులై 2)


ఆయనకు కలెక్టర్ ఉద్యోగం అంటే గొప్ప హోదా అని ఏనాడు అనుకోలేదు. ఇదంతా బాధ్యతగానే భావించారు. విద్యార్థి దశ నుంచే ప్రజలకు సేవ చేయడం ఎలా అని ఆలోచించేవారు. దీనికి ప్రభుత్వ ఉద్యోగమే సరైన మార్గం అని ఎంచుకున్నారు. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయడంతో పేదరికం ఆయనకు అడ్డు రాలేదు. మొదట సబ్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగంలో చేరారు. తనకిచ్చిన పనిలో ప్రజల ప్రేమను పొందారు. ప్రజాసేవకు పరిధి పరిమితంగా ఉండడంతో ఇంతకంటే ఉన్నత ఉద్యోగానికి వెళ్లాలని ఆకాంక్షించారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివడం... ఆ పరీక్షల్లో ఉత్తీర్ణత స్థాయి రాష్ట్ర ప్రధమ ర్యాంకర్ గా నిలిపింది. ఆయనే మన బాపట్ల జిల్లా కలెక్టర్ జరుగు వెంకట మురళి. సబ్ కలెక్టర్ గా పరిపాలన విభాగంలోకి ప్రత్యక్షంగా ప్రవేశించారాయన. 2024 జులై 4వ తేదీన బాపట్ల జిల్లా కలెక్టర్ గా చేరడంతో ఆయన బాధ్యత మరింత పెరిగింది. ఇలా ఉద్యోగన్నతి పొందడం, తనలో ఉన్న సేవా గుణానికి అధికార పరిమితులు అధికమయ్యాయి. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రతిక్షణం అంకితభావం దర్శనమిస్తోంది. సమాజంలో నిరాదరణకు గురైన దివ్యాంగులు, ఎస్టీలకు న్యాయం చేయాలని ప్రతినెల నాలుగో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తూ సేవలందిస్తున్నారు.

**బాపట్ల జిల్లా అభివృద్ధికి....**

నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ఆయన ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా వ్యవసాయం, మత్స్య, చేనేత రంగాలలో వ్యాపార వృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందించారు. బాపట్లలోని పర్యాటక వనరులను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రణాళికలు రచించారు. ఈ రంగాల అభివృద్ధితో జిల్లాకే గాకుండా రాష్ట్రానికి ఆదాయ వనరు, ఆదర్శంగా మార్చడమే ఆయన లక్ష్యం. ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగులు, సంఘాలు, కళాకారులను సమన్వయం చేసుకుంటూ వివిధ రకాలుగా ప్రణాళికలు రూపొందించారు. అవన్నీ ఇప్పుడు కార్యాచరణలో ఉన్నాయి. జిల్లాకు కలెక్టర్ గా వచ్చిన తొలినాళ్లలోనే అన్ని ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. శతాబ్దాల క్రితం బ్రిటిష్ పాలనకు ముందే విదేశీ వర్తక వాణిజ్య కేంద్రంగా ఉన్న మోటుపల్లి ఓడ రేవును మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు చారిత్రక పరిశోధకులు, పురావస్తు శాస్త్రవేత్తలతో పలుమార్లు చర్చించారు. అలనాటి వీరభద్ర స్వామి దేవాలయాన్ని మ్యూజియం, పర్యాటక ప్రాంతంగా చేయడానికి చర్యలు ప్రారంభించారు. భూమి కేటాయించడంతోపాటు చారిత్రాత్మక సంపదగా ఉన్న వీరభద్రస్వామి విగ్రహాన్ని తెప్పించేందుకు ఏర్పాట్లు మొదలు పెట్టారు.

**విపత్తులో ప్రజలకు తోడుగా...**

కృష్ణానది వరద విపత్తులు గతేడాది సెప్టెంబర్ 2 లో సంభవించగా నేనున్నానంటూ లంక గ్రామాల ప్రజలకు ధైర్యం కల్పించి ప్రభుత్వ సహాయం అందించడంలో కృతార్థులయ్యారు. రాత్రి పగలు తేడా లేకుండా కృష్ణానది చెరువులోని కొల్లూరు ప్రాంతంలో ప్రజల మధ్యనే ఉండి సహాయక చర్యలు అందించారు. వరదలో చిక్కుకున్న 30 వేలమంది నిరాశ్రయులను తన కుటుంబ సభ్యులుగా భావించి అన్ని తానై నిలిచి సేవలందించారు. వరద విపత్తుతో నీట మునిగిన గ్రామాలకు పడవల ద్వారా తాగునీరు, ఆహార పదార్థాలను ఐదు రోజులు పాటు అందించడం, తదుపరి 24 గంటల్లోనే రహదారులు, విద్యుత్ ను పునరుద్ధరించారు. సహాయక చర్యలు అందించడంలో జిల్లా కలెక్టర్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం భేష్ అని అభినందించగా, రాష్ట్ర గవర్నర్ బంగారు పతకంతో సత్కరించారు. ప్రజలకు విశేష సేవలు అందించే రెడ్ క్రాస్ సంస్థ సభ్యత్వ నమోదులోనూ బాపట్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలువగా గవర్నర్ చేతుల మీదుగా ప్రత్యేక అవార్డు అందుకున్నారు.



**ఎస్టీలకు ఆధార్...**

చెరువులు, కాల్వల గట్లపై దుర్భర జీవితం సాగిస్తున్న ఎస్టీలకు జీవనాధారం కల్పించారు. వారి జీవన స్థితిగతులను గుర్తించిన కలెక్టర్ డిసెంబర్ నెలలో సర్వేకు ఆదేశాలిచ్చారు. 48,700 ఎస్టీలను సర్వే చేయగా 1,900 మందికి ఆధార్ కార్డులు లేనట్లుగా గుర్తించారు. వారి వద్ద ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆర్డీవోలు పంచనామా నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్ తో జనన, చిరునామా ధ్రువీకరణ పత్రాలను జారీచేసి తద్వారా ఆధార్ కార్డులు అందించారు. తదుపరి పొదుపు సంఘాలలో చేర్పించి స్థిరమైన జీవనోపాధి కల్పించారు. వారికోసం ప్రతి నెల నాలుగో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తూ వారి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నారు. అలాగే దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించి తక్షణమే పరిష్కార మార్గం చూపుతున్నారు.

(తరువాయి 4లో...)

# పశుదానా పేరుతో డబ్బులు వసూళ్లు

### బాధితుల వద్ద నుండి బస్తాకు రూ.600 చొప్పున వసూళ్లు

దాన ఇవ్వలేదని బాధితులు ఆందోళన




(షణ్ముఖ వెలుగు, మద్దిపూడి, జులై 2)

పశువుల దాన పేరుతో డబ్బులు వసూలు చేసిన సంఘటన మండల కేంద్రమైన మద్దిపూడిలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం పాడి గేదెలలో పాడి ఉత్పత్తి అయ్యేందుకు ప్రభుత్వం పెల్లెట్ దానాను పశుపోషకులకు 50 శాతం సబ్సిడీ పై అందిస్తున్నారు. ఈ క్రమంలో మద్దిపూడి పశు వైద్యశాలలో అటెండర్లు సురేష్ లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఖాజావలి ఇద్దరు పశుపోషకుల వద్ద రూ.555ల విలువ చేసే 50 కిలోల దాన బస్తాను రూ.600 చొప్పున దాదాపు లక్ష ఇరవై వేల రూపాయలు వసూళ్లు చేశారు. ఇద్దరూ ధైర్యంగా పశు వైద్యశాలలోనే మద్యం సేవించడం, మద్యం ఎక్కువైతే బల్లాలపై పడుకోవడం ఉన్నతాధికారులను సైతం లెక్కచేయడం లేదు. ఇంత జరుగుతున్నా వారి పై చర్యలు తీసుకున్న నాధుడే లేరంటే అతిశయోక్తి కాదు. వైద్యం చేయమని (తరువాయి 5లో...)

# అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో 7 మంది అరెస్టు

### మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్



వెలుగు

రూ.10 కోట్ల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్

పోలీసుల అదుపులో నిందితులు - పరారీలో మరి కొంత మంది

ఎస్పీ, కలెక్టర్ కు ఎమ్మెల్యే ఉగ్ర ఫిర్యాదు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 1)

ఎస్పీ, కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఉగ్ర ఫిర్యాదు...

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 2)

తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పాత్రధారులైన 7 గురు నిందితులను బుధవారం కనిగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసు వివరాలను స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్ వెల్లడించారు. కనిగిరి పట్టణంలోని శంఖవరం రెవెన్యూలో సర్వే నెం. 301, 302లో 0.95 సెంట్ల స్థలాన్ని నకిలీ పత్రాలతో ఆక్రమించారు. ఆ స్థలాన్ని అమ్ముకుని అక్రమ లాభం పొందాలని బోనా బర్నాబసు, అన్నపురెడ్డి కొండారెడ్డి, జె దిల్వాన్, ముక్కు వెంకటేశ్వర్లు, శ్రీరాములురెడ్డి, సానికొమ్ము బ్రహ్మారెడ్డి, బి రవిలతో పాటు మరో 7 మంది తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించారు. తప్పుడు డాక్యుమెంట్ల పై కనిగిరి సిఐ షేక్ ఖాజావలి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నుండి రికార్డులు తెప్పించుకుని విచారించారు. విచారణలో 14 మంది నేరం (తరువాయి 5లో...)




# అంతా నేనే....

## నేను చెప్పినట్లే అధికారులు వినాలి....

### లేకుంటే వైసీపీ తొత్తులని ఎమ్మెల్యేకు చెబుతా

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 2)



అంతా నేనే....నేను చెప్పినట్లే అధికారులు వినాలి....లేకుంటే మాట వినని అధికారులను వైసీపీ ముద్ర వేసి వారికి తొత్తులుగా పని చేస్తున్నారని ఎమ్మెల్యేకు చెబుతానని బెదిరిస్తూ అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఓ చోటా టిడిపి నాయకుడిని కనిగిరి మండల ప్రజలతో పాటు టిడిపి నాయకులు కూడా అస్పహ్యించుకుంటున్నారు. ఈ నాయకుడు అధికారులు కార్యాలయానికి సమయానికి వస్తారో రారో తెలియదు కాని ఈ నాయకుడు మాత్రం తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ అధికారుల ముందు కూర్చుని సామాన్య ప్రజలు తమ సమస్యలను చెప్పుకోలేని విధంగా వ్యవహరిస్తున్నాడు... మాజీ సర్పంచ్ అయిన ఈ నాయకుడు గత జడ్పీటిసి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి వైసీపీ అభ్యర్థి మడతల కస్తూరిరెడ్డితో కుమ్మక్కై పోటీ నుండి తప్పుకున్నారు. దాంతో కస్తూరిరెడ్డి ఎన్నిక ఏకగ్రీవమై టిడిపి కార్యకర్తలు కుమిలిపోయారు. (తరువాయి 5లో...)

# ప్రజల ఆశయాలకు తోడు


























### పర్యాటకంపై ముద్ర...

బాపట్ల జిల్లాను పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లో భాగంగా బాపట్ల తీర ప్రాంతాన్ని పర్యాటక హబ్ గా మార్చుడానికి చర్యలు ప్రారంభించారు. సూర్యలంక బీచ్ లో వేలాది మొక్కలు నాటించారు. ఆయన రూపొందించిన అభివృద్ధి ప్రణాళికకు కార్యరూపం ఇస్తూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అడవి గ్రామం వద్ద పర్యాటకులు బోట్ షికార్ చేయడానికి వీలుగా తయారుచేసిన ప్రణాళిక త్వరలో రూపుదిద్దుకోనుంది. సూర్యలంక పేరళి కెనాల్ నుంచి నిజాంపట్నం ఓడరేవు వరకు గత ఏడాది జూలై 14 తేదీన ఆయన సాహసోపేతంగా పడవలో ప్రయాణించారు. మడ అడవుల మొక్కల సంరక్షణ, అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని ప్రభుత్వం అభినందించింది. వాటి అభివృద్ధికి ఆయన రూపొందించిన ప్రణాళిక అమలుకు అంగీకారం తెలిపింది. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో తీర ప్రాంతాలలో విస్తృతంగా మొక్కలు నాటిస్తున్నారు.

### పి 4 లో... రాష్ట్రం లోనే ప్రథమం

అత్యంత నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పి-4 విధానానికి స్వీకారం చుట్టింది. రాష్ట్రమంతా చేపట్టే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్నగంజాం మండలం పెద్దగొల్లపాలెం గ్రామంలోనే ప్రారంభించారు. జిల్లాలో ఇలాంటి 62,388 నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా నామకరణం చేశారు. వారికి ఎలాగైనా సహాయం చేయాలని 3528 మందిని మార్గదర్శిలుగా చేర్చడం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. పి-4 కింద 14 కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు జీవనోపాదులవృద్ధికి సాయమందించారు. చీరాలకు చెందిన ఓ ఆనాథ యువకుడిని డిఆర్డిఎ ద్వారా దత్తకు తీసుకుని రూ.50వేలు తక్షణమే సహయం అందిచటంలో కలెక్టర్ వెంకట మురళి ప్రత్యేక చొరవ చూపారు.

### స్వచ్ఛత వైపు అడుగులు....

చెత్త రహిత జిల్లా లక్ష్యంగా కలెక్టర్ అడుగులు ముందుకు వేస్తున్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని భావించిన కలెక్టర్ వెంకట మురళి పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఇందుకొరకు ఎంపీడీవోలు, డిప్యూటి ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులతో బాపట్లలో మే22వ తేదీన చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, గ్రామాల పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. రహదారులు వెంట చెత్త కనిపించరాదంటూ అధికారులకు సూచనలు ఇచ్చారు. నెల రోజుల పాటు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. చెత్త దంప్ చేయటానికి స్థలాల లేని చోట తక్షణమే భూమి కేటాయించాలని రెవిన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### కలెక్టర్ ఔదార్యం....

పారిశుధ్యంలోనూ కార్మికుల రక్షణ చర్యలు తీసుకున్నారు. వారికి అవసరమైన గ్లౌజులు, మాస్కులు షూస్, కొబ్బరి నూనె, సబ్బులు, చీపుర్లు, పారలు వంటి పరికరాలు, పనిముట్లను కలెక్టర్ నిధి నుంచి రూ.50లక్షలతో కొనుగోలు చేసి అందించారు. స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూనే గ్రీన్ అంబాసిడర్ల ఆరోగ్య సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు. అంత మాత్రమే కాకుండా పలు గ్రామాలలో పర్యటించి తడి,పొడిగా చెత్తను ఇంటి వద్దనే విభజించాలని నేరుగా ప్రజలకు వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద సృష్టించే విధానంపై ఫోకస్ పెట్టారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవటంలో కలెక్టర్ వెనకాడటం లేదు.

### అర్జీదారులకు కడుపునిండా భోజనం....

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నేరుగా కలెక్టర్ కు సమస్యలు విన్నవించుకోవడానికి జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారులకు ప్రతి సోమవారం ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఆకలితో వెను తిరగకూడదని కలెక్టరేట్ ఆవరణలోనే ప్రతి సోమవారం, నెలలో నాల్గో శుక్రవారం జరిగే ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ కు వచ్చే అర్జీదారులకు కలెక్టర్ ఉచిత భోజనాన్ని అందిస్తున్నారు

జిల్లా కలెక్టర్ వినియోగించే సామాజిక మాధ్యమాలలో వచ్చే ఫిర్యాదులకు సైతం ఆయన తక్షణమే స్పందిస్తున్నారు. ఇటీవల కర్లపాలెం మండలంలో పేరలీ గ్రామంలో బెల్టు షాప్ నిర్వహిస్తున్నారని ఓ మహిళ బాపట్ల జిల్లా కలెక్టర్ సామాజిక మాధ్యమంలో ఫిర్యాదు చేశారు. సమస్యపై కలెక్టర్ వేగంగా స్పందించారు.

### చీరాల కుప్పడం.....

చీరాల కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డు లభించేలా కలెక్టర్ విశేషంగా కృషి చేశారు. జనవరి 9వ తేదీన కేంద్ర బృందం సభ్యులు ఇష్ దీప్, డాక్టర్ దివ్యడింగ్రా క్షేత్రస్థాయి పరిశీలనపై బాపట్ల చీరాలలో పర్యటించారు. చేనేత వస్త్రాలైన కుప్పడం చీరల ఉత్పత్తులు, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై కేంద్ర బృందానికి నివేదిక అందించడంతోపాటు కలెక్టర్ చక్కగా వివరించారు. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి)కింద కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డును కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 14వ తేదీన న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డును కలెక్టర్ అందుకోనున్నారు. సంప్రదాయ మగ్గాలపై నేతన్నలు నేసిన చీరాల కుప్పడం చీరలకు మరింత ప్రాచుర్యం లభించనుంది. చేనేతల కష్టాలు తీరనున్నాయి.

### పొగాకు కొనుగోలు....

బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టడంతో బాపట్ల జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారు. చీరాల, పర్చూరు, జెపంగులూరు, ఇంకొల్లు మండలాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవడంలో ప్రధాన పాత్ర పోషించారు. వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రయోజనం పొందేలా ప్రభుత్వ నిర్ణయాన్ని రైతుల వద్దకు చేరుస్తున్నారు. ప్రతి కేంద్రంలో కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పూర్తిస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

### హాస్టల్స్ లో మౌలిక సదుపాయాలు....

వసతి గృహాల విద్యార్థుల కష్టాలు తెలుసుకున్న కలెక్టర్ మానవతా దృక్పథంతో స్పందించారు. జిల్లాలో ఎస్సీ,బీసీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ లో మౌలిక సదుపాయాల కల్పనకు కలెక్టర్ వెంకట మురళి దృష్టి సారించారు. పేద విద్యార్థులు ఆరోగ్యంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవడానికి డిస్టిక్ మినరల్ ఫండ్ కేటాయించారు. 68 ఎస్సీ, ఎస్టీ,బీసీ హాస్టల్స్ తో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలోనూ విద్యార్థుల మౌలిక అవసరాల కొరకు రూ. ఒక కోటి 18 లక్షలు నిధులు ఇచ్చారు. హాస్టల్స్ మరమ్మతుల కొరకు మరో కోటి 76 లక్షలు నిధులు కేటాయించారు. విద్యార్థుల సౌకర్యం కోసం ప్రతి హాస్టల్లో మినరల్ వాటర్ ప్లాంట్, గీజర్, కుర్చీలు, ఇచ్చారు. విద్యార్థుల సంరక్షణ కొరకు ఒక్కొక్క వసతి గృహానికి ఎనిమిది చొప్పున సీసీ కెమెరాల టీవీలను ఏర్పాటు చేశారు.

### ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కొరకు...

జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం గురి కాకుండా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ సిబ్బందితో సర్వే నిర్వహించారు. గుర్తించిన ప్రభుత్వ భూములకు రక్షణ చర్యలు చేపట్టారు.

### అనాధ శిశువులకు అండగా....

అనాధ శిశువులకు ఆశ్రయం కల్పించే శిశు గృహంను కలెక్టర్ సందర్శించారు. వారి బాగోగులు చూసుకోవాలని సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. వారిని తన తన బిడ్డలుగా భావిస్తున్నాను అంటూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు కలెక్టర్. తద్వారా నిరంతరం ఆయన పర్యవేక్షిస్తున్నారు...







# డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



మార్కాపురం పట్టణంలో చేయనున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు ను ఈరోజు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ తమిమ్ అన్సారియా, జనసేన నియోజకవర్గ ఇంచార్జి ఇమ్మడి కాశీనాథ్ లు కలిసి పర్యవేక్షించారు. మొదటగా తర్లుపాడు రోడ్ లోని అల్లూరి పోలేరమ్మ దేవస్థానం దగ్గరలో ఉన్న హెలిపాడ్‌ను, పక్కనే ఉన్న సాయి బాలాజీ స్కూల్ ఎదుట సభాస్థలి ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రూ.1290 కోట్లతో వెనుకబడిన ఈ ప్రాంతంలో







ఇంటింటికి పైప్ లైన్ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు కృషి ఎంతో దాగి ఉందన్నారు. వారందరికీ ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. 4వ తేదీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదన పవన్ కళ్యాణ్ ఈ స్కీంను శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవస్థానం ఎదుట ఉన్న ప్రాంతంలో శంకుస్థాపన చేయనున్నారని, దీనికి మార్కాపురం నియోజకవర్గంలోని ప్రజలు, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

## పశుదానా పేరుతో డబ్బులు వసూళ్లు



వచ్చిన పశుపోషకులను లెక్కచేయ కుండా మాట్లాడు తున్నారని పశు పోషకులు తెలిపారు. రెండు నెలల క్రితం మండలంలోని వల్లాయి పాలెం, మర్రిపూడి, రాజుపాలెం, దుగ్గిరెడ్డిపాలెం, గంగపాలెం తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 మంది పశు పోషకుల వద్ద సుమారు లక్ష ఇరవై వేలు వసూళ్లు చేసి దాన ఇవ్వలేదన్నారు. ఆయా గ్రామాల పశుపోషకులు ప్రతిరోజు పశు వైద్యశాలకు రావడం, వెళ్లడం జరుగుతుంది. వైద్యశాలకు వచ్చిన ప్రతి ఒక్కరికి రేపు, ఎల్లుండి దాన వస్తుంది ఇస్తా అని చెప్పడంతో వారు విని దొరుకుతున్నారని మండలంలోని వల్లయపాలెం గ్రామానికి చెందిన మద్దూరి ప్రభాకర్, పి కోటయ్య, వనిపెంట రామచంద్రారెడ్డి, రాజుపాలెం గ్రామానికి చెందిన అరక గురవయ్య, మర్రిపూడికి చెందిన సూర్య శ్రీనివాస్‌రెడ్డి, పూనూరు సంజీవరెడ్డి, కోమర చెంచయ్య, తదితరులు వాపోయారు. గత రెండు రోజుల క్రితం మరిపూడి వైద్యశాలకు 44 బస్తాలు దాన వచ్చిన విషయం తెలుసుకున్న పసుపోషకులు బుధవారం మర్రిపూడి పశు వైద్యశాల వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. వైద్యశాలలో స్టాక్ ఉన్న 44 బస్తాలు దానా పంపిణీ చేస్తేనే కానీ మేము ఇక్కడి నుండి కదలము అని ఆందోళన చేశారు. ఉదయం 10.30 గంటలకు విధులకు హాజరైన పశు వైద్యాధికారి మంచాల మన శేఖర్ పసుపోషకులను చూసి విస్తుపోయారు. దాన ఇస్తేనే ఇక్కడి నుండి వెళ్తామని రైతులు స్పష్టం చేశారు. వారం రోజుల క్రితం వైద్యాధికారిగా కొత్తగా విధుల్లో చేరానని, మీరు డబ్బులు ఇచ్చిన విషయం తనకు తెలియదని, విచారించి న్యాయం చేస్తానన్నారు. తమ సిబ్బందికి గతంలో ఎవరైతే దానా కోసం రూ.600లు చొప్పున నగదు చెల్లించారో వారి పేర్లను నమోదు చేసుకుంటానని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తాననడంతో రైతులు శాంతించారు.

## అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో 7 మంది అరెస్టు

చేసినట్లు రుజువు కావడంతో వారిలో పై ఏడుగురిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న ఫోర్జరీ డాక్యుమెంట్లను స్వాధీనపరుచుకుని వారిని కోర్టుకు హాజరుపరిచినట్లు డిఎస్పీ తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. కనిగిరి సబ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు భూములను ఎవరు ఆక్రమించినా, నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్టర్ చేసుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ తెలిపారు. కాగా కనిగిరిలో ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్‌లు, నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారాలు మరో నాలుగు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. బాధితులు కూడా త్వరలో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. కేసును చేధించిన కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్, సిఐ షేక్ ఖాజావలి, ఎస్ఐ టి శ్రీరామ్, కె మాధవరావు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

## అంతా నేనే....

### నేను చెప్పినట్లే అధికారులు వినాలి....

అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నా ఈ నాయకుడి స్వగ్రామంలో వైసీపీకి 119 ఓట్ల మెజార్టీ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి టిడిపి కి మెజార్టీ రాని గ్రామాల నాయకులు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, ప్రజలే నేరుగా వస్తే వారికి పనులు చేస్తానని సభాముఖంగా తెలిపారు. ఇటీవల పనుల విషయంలో కూడా మెజార్టీ తేలేని నాయకుల్లో ఒకరైన ఆ మాజీ సర్పంచ్ కూడా ఎమ్మెల్యే మందలించినట్లు సమాచారం. కానీ ఆ నాయకుడు మాత్రం పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయాలన్నీ వదిలి పెట్టడం లేదని ప్రజలు, టిడీపీ నాయకులు, కార్యకర్తలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ నేత ఆ మాజీ సర్పంచ్‌కు అంత సీన్ లేదని తరచూ చెబుతున్న పరిస్థితుల్లో కూడా ఆ నాయకునికి అధికారులు భయపడడం ఏమిటో అర్థం కావడం లేదని తెలుగు తమ్ముళ్ళు అంటున్నారు. అధికారులకు పోస్టింగ్‌లు ఇప్పిస్తానని కనిగిరి మండలంలో నలుగురు విఆర్‌ఓలను ఇక్కడ వద్దంటూ పరోక్ష హెచ్చరికలు చేస్తున్నట్లు విఆర్‌ఓలు వాపోతున్నారు. రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశంలో కూడా ఈ మాజీ సర్పంచ్ పాల్గొనడం పట్ల సిబ్బంది తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో తప్పు చేసిన టిడిపి నాయకులనే ఎమ్మెల్యే ఉగ్ర అరెస్టు చేయించడంతో ఈ చోటా నాయకుడికి కూడా ఎమ్మెల్యే వార్నింగ్ ఇస్తే కనిగిరి మండలంలో టిడిపి బాగుపడుతుందని టీడీపీలోని అధిక గ్రామాల నాయకులు అంటున్నారు. గ్రామాల్లో గ్రూపులను పెంచి పార్టీని బలహీన పరుస్తున్నారని టీడీపీ నాయకులు వాపోతున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో తప్పు చేసిన టిడిపి నాయకులకు ఎమ్మెల్యే ఏ విధంగా చెక్ పెట్టారో అదే విధంగా బ్లాక్ మెయిల్ నాయకులను కూడా ఎమ్మెల్యే దూరం పెడితే బాగుంటుందని కనిగిరి మండల టిడిపి నాయకులు అంటున్నారు.

## 23వ డివిజన్‌లో ఇంటింటికి సుపరిపాలన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)
టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఆదేశానుసారం ఒంగోలు నగరం, 23వ డివిజన్ ,బూత్ 106, 107 నందు ఇంటింటికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కూటమి ప్రభుత్వం పై ప్రజాభిప్రాయం అడుగుతూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ , కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలు, త్వరలో ప్రజలకు అందించబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఒంగోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేస్తూ, పోతురాజు కాల్వ మురికి తీత పనులు , ఒంగోలు నగర సుందరీకరణ పనులు,డివిజన్ వారిగా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరంగా తెలియపరుస్తూ, వారికి కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రం అందజేస్తూ, ప్రజా సమస్యలను నోట్ చేసుకుంటూ డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పబ్బిశెట్టి రాము,బూత్ ఇంచార్జి షేక్ అక్బర్ బాషా, డివిజన్ అబ్జర్వర్ తమ్మిశెట్టి రమాదేవి, ఒంగోలు పార్లమెంట్ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి గోపు వీరాంజనేయులు, వాయల మల్లిఖార్జున,అష్రఫ్ అబ్దుల్లా, బూదాటి బదరి నారాయణ, సిద్దు అలియాస్ డేవిడ్ రాజు పాల్గొనడం జరిగింది.

## దాతల సహకారంతో పొన్నలూరు జిల్లా పరిషత్ హై స్కూల్ అభివృద్ధి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 2)
మండల కేంద్రమైన జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది. నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన గుమ్మల్ల వెంకట్రావు, రవిబాబు తన తండ్రి జ్ఞాపకార్థం కొండపి నియోజకవర్గ మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మల్ల మాలకొండయ్య పేరు మీదగా మూడు లక్షల పైగా ముఖ ద్వారం, గేట్లు నిర్మించారు, వంటగది కి ముందు వరండాకు రేకులు 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 36 వేల రూపాయలతో నిర్మించారు. అలాగే పాఠశాల అభివృద్ధికి మరోదాత వెలగపూడి శ్రీనివాసరావు దాదాపు 10 లక్షల రూపాయలతో మహాత్మా గాంధీ, గౌతమ్ బుద్ధుడు, స్వామి వివేకానంద విగ్రహాలను స్కూల్ ఆవరణములో నిర్మించారు. మరోదాత నేలపాటి బ్రహ్మయ్య చౌదరి సరస్వతీ మాత విగ్రహాన్ని, ఇటీవల పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు మరియు ఆదిలక్ష్మి సరస్వతి మాత మండపానికి ఒకటిన్నర లక్ష రూపాయలతో నిర్మించారు. డయాస్ వేదికను దాతలు ముళ్ళ మురి వెంకటేశ్వర్లు, అహ్మద్ హుస్సేన్, కొండపి విశ్వేశ్వరరావు పేర్లు మీద దాదాపు మూడు లక్షల రూపాయలతో పాఠశాల ప్రాంగణంలో నిర్మించారు. దాతల సహకారం మరువలేనిదని ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.













## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 2)
పేద వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సుపరిపాలనకు ఏడాది కార్యక్రమంలో భాగంగా బుధవారం కనిగిరి పట్టణంలోని చింతల పాలెం, శంఖవరం ఎస్సీ కాలనీలతో పాటు పీసీపల్లి మండలం గుంటుపల్లి, పామూరు మండలం బొట్లగూడూరులో సుపరి పాలన కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజక వర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతు న్నాయన్నారు. బయోగ్యాస్ ప్లాంట్‌తో ఉపాధి దొరకడంతో పాటు రైతుల పొలాలకు కూడా డిమాండ్ పెరుగుతుందన్నారు. కనిగిరిని కనకపట్టణంగా మారుస్తు న్నామన్నారు. సిసి రోడ్లతో పాటు హైవే, రైల్వే పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అర్హులందరికీ పింఛన్ల మంజూరు కూడా జరుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో చిరంజీవి, బేరి పుల్లారెడ్డి, చెంచిరెడ్డి, వేమూరి రామయ్య, పులి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)
త్వరలో పోలీసు శిక్షణకు హాజరుకాబోతున్న రిక్రూట్‌ల కోసం పోలీస్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ బుధవారం సందర్శించారు. త్వరలో పోలీసులకు శిక్షణ నేపథ్యంలో ఒంగోలులోని పోలీస్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌ను బుధవారం ఉదయం జిల్లా ఎస్పీ సందర్శించారు. అనంతరం డీటీసీ చుట్టూ వున్న పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్‌లు, ఓపెన్ జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను ఇతర అధికారులతో కలసి పరిశీలించి, శిక్షణ నిమిత్తం అవసరమైన అన్ని ఏర్పాట్లు త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే, డిటీసీలో చేపట్టాల్సిన మరమ్మత్తు పనులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు అందించారు. అనంతరం, శిక్షణా ర్థులకు శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్ మరియు ఇతర శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడే గ్రౌండ్ అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మైదానం చదునుగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని, రన్నింగ్ ట్రాక్, డ్రిల్ ఏరియా, , గార్డన్ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కొత్త పోలీసు సాంకేతికతలకు, ఆధునిక విధానాలకు అనుగుణంగా శిక్షణా ప్రణాళికలు నవీకరించాల్సిన అవసరం ఉందనన్నారు. శిక్షణ కేంద్రంలో అదనపు సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, మౌలిక వసతుల ఏర్పాటుకి ప్రత్యేక శ్రద్ధ అవసరమని, అలాగే వర్షపు నీరు బయటకు పోవుటకు ఏర్పాట్లు చేయాలని, పరిసర ప్రాంతాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు,డీటీసి ఇన్స్పెక్టర్ షమీముల్లా, పిసిఆర్ ఎస్సై వేణుగోపాల్, ఆర్ఎస్సై రవి కుమార్ , సిబ్బంది ఉన్నారు.

# కోటపాడు, రాజోలుపాడులో పొలం పిలుస్తోంది

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 2)

పొన్నలూరు మండలంలోని కోటపాడు, రాజోలుపాడు గ్రామాలలో మండల వ్యవసాయాధికారి వి.రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు, వి రాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళ, బుధ వారాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు శాస్త్రవేత్తలు అందరూ ఒకే వేదిక మీదకు వచ్చి రైతులకు ప్రభుత్వ పథకాలు మరియు సబ్సిడీలు, అవగాహన కల్పించి, సాంకేతిక సమాచారం అందించి, క్షేత్ర స్థాయిలో తక్షణం పరిష్కారం సూచించడమే దీని యొక్క ఉద్దేశం అని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సహాయ వ్యవసాయ సహాయకులు సింగరాయకొండ, డాక్టర్ ఇ నిర్మలా కుమారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేసిన ప్రతి పంటను రైతులు అందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా పంట దిగుబడిని కొనుగోలు కేంద్రాలలో విక్రయించవచ్చన్నారు. పంట నష్ట పరిహారం లేదా పంట బీమా ద్వారా ఇన్సూరెన్స్ పొందవచ్చునని తెలిపారు. అలాగే రైతులు అందరూ వేసిన ప్రతి పంటకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని, మరియు భూసార పరీక్షలు చేసుకొని, భూసార పరీక్షల విశ్లేషణ పత్రాల ఆధారంగా రసాయనిక ఎరువులు వాడుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి వి రాము మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ శాఖ నుండి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు, జనుములు 100 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని పూర్తి ఖరీదు కేజీ రూ.109.00, రైతు కట్టవలసినది, 50శాతం రాయితీతో రూ 54.50 అని, కావలసిన రైతులు మీ సంబంధిత రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని నగదు చెల్లించి తీసుకోవచ్చని తెలియజేసారు. పచ్చిరొట్టఎరువులైన జనుము, జీలుగ మరియు పిల్లిపేసర వేసుకొని, పూత సమయంలో భూమిలో కలియదున్నడం వలన భూసారం వృద్ధి చెంది, కర్బన శాతం పెరిగి భూమి గుల్ల బారి, భూమిలో తేమశాతం పెరిగి బెట్ట నుండి కాపాడుకోవచ్చని, పైర్లు ఆరోగ్యంగా పెరిగి అధిక దిగబడి పొందవచ్చునని తెలిపారు.అలాగే ఖరీఫ్, రబీ సీజన్లో పంట సాగు చేసే ప్రతి ఒక్క భూమిలేని కౌలు రైతు తప్పనిసరిగా మీ సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి, మీ ఆధార్ కార్డు,భూయజమాని పట్టాదారు పాసు పుస్తకం, ఎంత విస్తీర్ణంలో ఏమి పంట వేస్తారో తెలియజేసి కౌలు ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునని తెలిపారు. దీని ద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ నుండి విత్తనాలు, ఎరువులు, పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, బ్యాంకు లో రుణాలు మరియు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు లబ్ది పొందవచ్చునని తెలియజేసారు. కావున రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోటపాడు, రాజోలుపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ మస్తాన్, కె మధు, వ్యవసాయ విస్తరణాధికారి ఇ సుధీర్, రెండు గ్రామాల పెద్దలు, రైతులు పాల్గొన్నారు.





## బద్దిపూడి, చాగోల్లు గ్రామాలలో పొలం పిలుస్తోంది

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 2)




మండల పరిధిలోని బద్దిపూడి, చాగొల్లు రైతు సేవా కేంద్రాల నందు బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి విజయ్ కుమార్, మండల ఉద్యాన అధికారి వి.విశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి.విజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నందు ఖరీఫ్ 2025 పంట సీజన్కు గాను ఈ పంట నమోదు చేయడం ప్రారంభించారని, మండలంలోని రైతులందరూ తమ గ్రామంలోని రైతుసేవ కేంద్రాలను వ్యవసాయ సహాయకులను సంప్రదించి తాము ఏ పంటను సాగు చేస్తే ఆ పంటను ఈ క్రాప్ నందు నమోదు చేయించుకోవాల్సిందిగా సూచించారు, అలాగే పొలాలను కౌలు సాగు చేసే రైతులందరూ కౌలు రైతు హక్కు పత్రాలను తీసుకోవాలని తద్వారా సాధారణ రైతుల లాగా కౌలు రైతులకు కూడా ప్రభుత్వం వారు అందించే అన్ని పథకాలకు అర్హత పొందుతారని తెలియజేశారు, ఈ కవులు రైతు హక్కు పత్రాల ద్వారా అన్నదాత సుఖీభవ, సబ్సిడీపై విత్తనాలు, ఈ పంట నమోదు వంటి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని రైతులకు తెలియజేశారు , ఈ కవులు పత్రాల వలన భూ యజమానులకు ఎటువంటి నష్టం ఉండదని ఇది కేవలం ఆ భూమిలో సాగే పంటకు మాత్రమే కౌలుదారునకు 11 లేదా అంతకన్నా తక్కువ నెలల వ్యవధి వరకే హక్కు కలిగిస్తుందని, దీనివల్ల భూ యజమానికి వచ్చేటువంటి అన్నదాత సుఖీభవ, ఇతర సబ్సిడీలలో ఎటువంటి మార్పు ఉండదని, కాబట్టి భూ యజమానులు నిరభ్యంతరంగా కౌలుదారునకు కౌలు హక్కు పత్రాలను ఇచ్చేందుకు ముందుకు రావచ్చునని తెలియజేశారు, ఈ కవులు హక్కు పత్రాల కోసం రైతులు తమ గ్రామ సచివాలయం నందు ఉన్న విలేజ్ రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలియజేశారు. ఈ ప్రక్రియలో ఏమైనా సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది తమకు సహకరిస్తారని తెలిపారు. మండల ఉద్యాన అధికారు వి విశాల్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ మరియు వెదురు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ పొలాల్లో వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలను కూడా ఈ పంట నందు నమోదు చేసుకోవాలని తెలియచేశారు, రైతులు తమ పొలాల గట్ల వెంబడి ఉన్న ఖాళీ ప్రదేశంలో కూడా కొబ్బరి, వెదురు వంటి మొక్కలను వేసుకోవచ్చని తద్వారా ఆ మొక్కల ద్వారా కూడా రైతుకు ఆదాయం కలుగుతుందని తెలియజేశారు అలా మొక్కలను వేసుకోవాలని ఆసక్తి ఉన్న రైతుల కు మొక్కల సంఖ్యతో సంబంధం లేకుండా వారు వేసుకునేటువంటి ఎన్ని మొక్కలకైనా ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇస్తున్నారని తెలియజేశారు. అలాగే ఉద్యాన శాఖలోని వివిధ రకాల పథకాల గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బద్దిపూడి, చాగల్లు గ్రామ ఉద్యాన సహాయకులు సత్యాల లక్ష్మి ప్రియాంక, వెంకట్రావు, వ్యవసాయ మార్కెటింగ్ గోడౌన్ ఇంచార్జ్ షేక్ మొహమ్మద్ బాషా, గ్రామంలోని రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్‌ల శిక్షణ తరగతుల పర్యవేక్షణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)

ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ డైరెక్టర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎన్ఫోర్స్మెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ రాహుల్ దేవ్ శర్మ బుధవారం ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కాలేజీ నందు శిక్షణ పొందుతున్న 102 ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్‌ల శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. ట్రైనింగ్ సబ్ ఇన్స్పెక్టర్‌లతో శిక్షణ పై సమీక్షించి వారికి తగిన సూచనలు చేసి ఎక్సైజ్ యాక్ట్ , ఎన్.డి.పి.ఎస్ యాక్ట్‌ల మేరకు నిందితులను అరెస్టు చేయడం, కేసు నమోదు సమయాన ముఖ్యంగా మహిళలను అరెస్టు చేసే సమయంలో, చెక్ పోస్ట్ నిర్వహణ సమయంలో తీసుకోవాల్సిన చట్ట పరమైన చర్యలను గురించి చర్చించారు. సమస్యల పై అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ట్రైనింగ్ సబ్ ఇన్స్పెక్టర్‌ల యొక్క ఔట్ డోర్ డ్రిల్ శిక్షణను పర్యవేక్షిచారు. ట్రైనింగ్ సబ్ ఇన్స్పెక్టర్‌ల యొక్క అవసరాలను తెలుసుకొని తగిన సూచనలు చేశారు.

## వైసిపి తప్పుడు ప్రచారాలు టిడిపి శ్రేణులు తిప్పి కొట్టాలి

### సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 2)

వైసీపీ తప్పుడు ప్రచారాలను టీడీపీ శ్రేణులు తిప్పి కొట్టాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో మార్కాపురం పట్టణంలోని 6వ వార్డులో, మార్కాపూర్ రూరల్‌లోని దరిమడుగు, తర్లుపాడు మండలంలోని తర్లుపాడు గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెడలి పాంప్లెట్లు పంచి భూత్ ఇన్చార్జిలతో మై టిడిపి యాప్‌లో ఆ కుటుంబాల వివరాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని అయినా కూడా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి ఏడాదిలోని తమ హామీలకు కట్టుబడి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని ప్రతి విద్యార్థి తల్లులు ఎకౌంట్లో ఒక్కో విద్యార్థికి పదవులు వేల రూపాయలు జమ చేశారని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో వృద్ధులు వితంతువులకు నెలకు 4000 రూపాయలు, దివ్యాంగులకు 6000 రూపాయలు, కిడ్నీ కాలేయం తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు 10000 రూపాయలు, పూర్తి వైకల్యం ఉన్నవారికి 15వేల రూపాయలుగా మొత్తంగా రాష్ట్రంలో 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు ఇస్తున్నారని అన్నారు. తమ ఎలక్షన్ల హామీ అయిన అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ లు ఇస్తున్నారని అన్నారు. యువతకు 16,347 పోస్టులతో డీఎస్సీ నియామకాలు త్వరలోనే చేపట్టబోతున్నారని, పోలీస్ శాఖలు నియామకాలు జరిపారని, పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల మంది ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగాయని అన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నారని అన్నారు. రైతు సంక్షేమం కొరకు కేంద్రంతోపాటు రాష్ట్ర నిధులు జోడించి అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే ప్రారంభం అవుతుందని అన్నారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం ఐదు రూపాయలకే న్యాయమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రానికి పలు బహుళ జాతి కంపెనీలను తీసుకువచ్చి వేల సంఖ్యలో ఉద్యోగ కల్పన చేశారని అన్నారు. గత వైసిపి పాలకులు పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, ఇంకా 4000 కోట్లు ఖర్చు చేస్తేనే ఆ ప్రాజెక్టు పూర్తి అవుతుందని త్వరలోనే ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. త్వరలోనే ప్రత్యేక మార్కాపురం జిల్లా సకారం చేస్తామని అన్నారు. టిడిపి శ్రేణులు వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తీపి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా బూత్ ఇన్చార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు పాల్గొన్నారు.



## 27వ డివిజన్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ఆదేశాల మేరకు 27వ.డివిజన్లో 182 బూతు పరిధిలో డివిజన్ అధ్యక్షుడు పప్పు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను. సూపర్ సిక్స్ లో. అమలు చేసిన పథకాలను. మరియు చేయబోతున్న అభివృద్ధి గురించి వివరించారు. ఇంట్లో నీవశించేవారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పాలూరి వెంకటేశ్వర్లు, కో కస్టర్ పీఎస్ బాబు, అబ్జర్వర్ వార్డ్ కుర్రా అయ్యప్ప,బూత్ ఇంచార్జి వాకాటి వెంకటేష్. పప్పు రవీంద్ర. నారాయణం శివ నారాయణ ఎస్.కె కరిముల్లా, ఎస్.కె మునీర్ కరవాది సాయి. కోచర్ల నవీన్.. ఎన్ నారాయణ, ఆనందం, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కుటుంబానికి దూరంగా ఉండటం ఎంతో దురదృష్టకరం

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)

క్షణికావేశంలో తప్పులు చేసి కుటుంబానికి దూరంగా ఉండటం సమాజానికి భారంగా ఉండటం ఎంతో దురదృష్టకరమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. బుధవారం ఒంగోలు పట్టణంలోని జిల్లా జైల్ ని సందర్శించిన న్యాయమూర్తి అక్కడ ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి వారి యొక్క సమస్యలను తెలుసుకున్నారు. వంటశాలను, స్టోర్ రూమ్ ని పరిశీలించి మరింత మెరుగైన వసతుల కోసం సూచించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఖైదీల తో మాట్లాడుతూ న్యాయవాది నిర్మించుకునే స్థోమత లేని ఖైదీలకు ఉచితంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టం ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. న్యాయవాదులు లేని ఖైదీలకు తక్షణం న్యాయవాది నియామకం కోసం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి పి వరుణరెడ్డి, వైద్యులు బ్రహ్మ తేజ, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి రవిశంకర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీర రాఘవులు, జైలర్ ఎలమందయ్యా పాల్గొన్నారు.

## బెల్ట్ షాపుల పై దాడులు నిర్వహించిన కంభం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్

### 22 క్వార్టర్ బాటిళ్లు సీజ్.... ఇద్దరు అరెస్టు



(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 2)

కంభం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బేస్తవారిపేట గ్రామం యందు ఎన్ చెంచయ్య అనే వ్యక్తి అక్రమంగా పది మద్యం సీసాలు కలిగి ఉన్నందుకు అరెస్ట్ చేయడం జరిగింది. సదర ప్రాపర్టీని సీజ్ చేయడం జరిగింది. అదేవిధంగా అర్ధవీడు మండలంలోని పాపినేని పల్లి గ్రామం యందు ఎన్. మంత్రుడు అనే వ్యక్తి అక్రమంగా 12 మద్యం సీసాలు కలిగి ఉన్నందుకు అరెస్టు చేసి సదరు ప్రాపర్టీని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కొండారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ఇతర రాష్ట్రాల మద్యం ను మరియు నాటు సారాయి, బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా ఇతర రాష్ట్రాల మద్యం తరలించినా, అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, అమ్మినా ప్రొహిబిషన్,ఎక్సైజ్ వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

# డిప్యూటీ సీఎం పర్యటనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 2)

ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి జల్ జీవన్ మిషన్ ద్వారా 1290 కోట్ల రూపాయలతో చేపట్టనున్న త్రాగునీటి పథకం శంకుస్థాపన మహోత్సవానికి ఈ నెల 4వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మార్కాపురంనకు విచ్చేస్తున్న నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా 1290 కోట్ల రూపాయలతో చేపట్టనున్న త్రాగునీటి పథకం శంకుస్థాపన మహోత్సవానికి ఈ నెల 4వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మార్కాపురం పర్యటనపై బుధవారం మార్కాపురంలోని సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ తో కలిసి జిల్లా అధికారులతో సమావేశమై ముందస్తు ఏర్పాట్లు పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులకు కేటాయించిన విధులను సమర్థంగా నిర్వర్తించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి గారు వచ్చే హెలిప్యాడ్ మరియు సభా వేదిక వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు క్రౌడ్ మేనేజ్మెంట్ పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమంపై అధికారులు సమగ్ర



ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమాలు జరిగే ప్రదేశాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించడంతో పాటు అవసరమైన ప్రదేశాల్లో మొబైల్ టాయిలెట్స్ ను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సుమారు పది వేల మంది ప్రజలు వచ్చే అవకాశం ఉందని, అందుకనుగుణంగా సభా వేదిక, పార్కింగ్ ప్రదేశాల్లో బ్యారికేడింగ్ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. సభా వేదిక ప్రాంగణంలో అవసరమైన మెడిసిన్ తో వైద్య సిబ్బందిని నియమించాలని, కార్యక్రమానికి హాజరు ప్రజలకు



ఎలాంటి సౌకర్యం లేకుండా సీటింగ్ ఏర్పాట్లు తో పాటు మంచినీరు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, మార్కాపురం డిఎస్పి నాగరాజు, జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గం ఇంచార్జి ఇమ్మడి కాశినాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణలతో కలసి సభా ఈ, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి ఏర్పాట్లు పై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దామచర్ల

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

## 5, 6 డివిజన్‌లలో ప్రారంభం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)

బాగున్నారా.. మీకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా... అంటూ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ప్రతి ఇంటికి వెళ్లి అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దామచర్ల నగరంలోని 5, 6 డివిజన్లో ప్రారంభించారు. గోపాల్ నగర్ లోని తిరుపతమ్మ దేవాలయంలో దామచర్ల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రోజుకు 50 ఇళ్లకు తగ్గకుండా తొలి అడుగు వేయాల్సి ఉండగా, ప్రజల నుండి వచ్చిన విశేష స్పందన చూసి 100 ఇళ్ల వరకు ఎంఎల్ఏ తిరిగారు. దామచర్ల జనార్ధన్ రావు తమ వీధిలోకి వస్తున్నారని తెలుసుకున్న ప్రజలు ఇంటి బయటనే ఆయన కోసం వేచి ఉన్నారు. కొంతమంది మహిళలు హారతి ఇవ్వగా, మరికొంత మంది గుమ్మడి కాయ కొట్టి దిష్టి తీశారు. ప్రజా స్పందన చూసిన దామచర్ల వారితో ప్రేమగా మాట్లాడారు. సూపర్ సిక్స్ లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తల్లికి వందనం గురించి విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం పథకం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. దామచర్ల జనార్ధన్ రావు ఇంటింటికి తిరుగుతున్న సమయంలో విద్యార్థులు పాఠశాలలకు సిద్ధమవుతుండగా, విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎక్కువమంది తమకు సొంత ఇల్లు లేవని, బాడుగ ఇళ్లల్లో నివసిస్తున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, స్పందించిన దామచర్ల వారందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా టిడ్కో ఇల్లు కూడా ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, కార్పొరేటర్ రమణయ్య, డివిజన్ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, నగర ప్రధాన కార్యదర్శి బోడపాటి వెంకట్, కొక్కిలగడ్డ లక్ష్మి, దుర్గా మల్లేశ్వరి, క్లస్టర్ కన్వీనర్లు కో కన్వీనర్లు, డివిజన్ పరిశీలకులు, బూత్ కన్వీనర్లు,తదితరులు పాల్గొన్నారు.













# జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 2)

జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు యూనియన్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన పొన్నలూరులో సిఐటియు సమావేశం జిల్లా అంగనవాడి యూనియన్ అధ్యక్షురాలు వై. సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ జులై 9 వ తారీఖున సిఐటియు ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్మిక సమస్యలు పరిష్కారం చేయాలని ముఖ్యంగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని రాజ్యాంగపరంగా కార్మికులకు సంబంధించిన 29 చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, నాలుగు కార్మిక కోడ్ రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేసేవరకు సిఐటి ఆధ్వర్యంలో పోరాట నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటేనపల్లి శ్రీనివాసులు, ఎంవి సుబ్బరామయ్య, పి మధురవాణి, రాధా, గౌస్య, విజయా తదితరులు పాల్గొన్నారు.





# నూతన ఎంఈవో అబ్దుల్ సత్తార్ కు సన్మానం

(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 2)

మండలంలో ఎంఈవో-1 గా బాధ్యతలు చేపట్టిన టి.అబ్దుల్ సత్తార్ ను, పూర్వ ఎంఈవో- 1 మాల్యాద్రి,ఎంఈవో-2 శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో-1 అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది సహకారంతో మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల



సమన్వయకర్త చిన్ని.పద్మావతీదేవి, సీఆర్పీలు, అకౌంటెంట్ రామచంద్రుడు,డేటాఎంట్రీ ఆపరేటర్ శేఖర్ తదిరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం



(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 2)

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశాన్ని ఆత్మీయ అనుబంధాలతో ఘనంగా నిర్వహించారు. బదిలీల ప్రక్రియలో భాగంగా పాఠశాల నుండి వెళ్ళే ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ పాఠశాలకు నూతనంగా వచ్చిన గురువులకు సాదర స్వాగతం పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా, మండల విద్యాశాఖాధికారిగా విశేష సేవలందించి బదిలీపై వెళుతున్న బి.మాల్యాద్రి మంచితనాన్ని, వృత్తి నిబద్ధతను గుర్తుచేసుకుని, భావోద్వేగానికి గురయ్యారు. పదోన్నతిపై ప్రధానోపాధ్యా యునిగా, రాచర్ల ఎంఈవో- 1 గా వెళ్ళిన మొయినుద్దీన్ విద్యా సేవలను ప్రశంసించారు. బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయుల వైజ్ఞానిక అనుభవాలను,అనుబంధాలను గుర్తు చేసుకుంటూ, అనుభూతి చెందారు.అనంతరం ఉపాధ్యాయులకు జ్ఞాపికలను, బహుమతులను అందిస్తూ ఆప్యాయతానురాగాలను పంచుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికి టీడీపీ క్యాంపెయినింగ్







(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జులై 2)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల అనుసారంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచనల మేరకు బుధవారం కొనకమిట్ల మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, కొనకనమిట్ల మండల క్లస్టర్ ఇంచార్జ్ కుందూరు కాశిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరి పాలన మొదటి అడుగులో భాగంగా మండలంలోని ఎదురురాళ్లపాడు, చింతగుంట్ల, కొనకనమిట్ల, నాగరాజుకుంట, గ్రామాల్లో ఇంటింటికి క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల మండల జనరల్ సెక్రటరీ జవ్వాజి భాషాపతి నాయుడు, కొనకనమిట్ల యూనిట్ ఇంచార్జ్ మువ్వా కాటంరాజు, చింతకుంట్ల యూనిట్ ఇన్చార్జి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు, గ్రామ తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 37వ డివిజన్‌లో సుపరి పరిపాలనలో తొలి అడుగు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ఆదేశాల మేరకు 37వ డివిజన్లో సుపరి పరిపాలనలో తొలి అడుగు భాగంగా బుధవారం ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్ పాడిబండ్ల వెంకటేశ్వర్లు , కో కన్వీనర్ గోగినేని రామారావు ,డివిజన్ అధ్యక్షుడు మేడికొండ మోహన్ రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి, కాపవరపు శ్రీనివాసరావు ,బూత్ ఇంచార్జి పువ్వాడ ఉషారాణి , వార్డు అబ్జర్వర్ గుమ్మల సుబ్బారావు , అబ్జర్వర్ తోట నాగలక్ష్మి , తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐదేళ్ల వైసీపీ పాలనంతా విధ్వంసం



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 2)

కొండపి మండలం గోగినేనివారిపాలెంలో కార్యకర్తల కోలహాల నడుమ పండుగ వాతావరణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంత్రి డా.స్వామి ప్రారంభించారు. గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన విధ్వంసం, ఆర్థిక లోటును పూడ్చుకుంటూ సంపద సృష్టితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా పాలన సాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం నాడు ప్రకాశం జిల్లా కొండపి మండలం గోగినేనివారిపాలెంలో కార్యకర్తల కోలాహంతో పండుగ వాతావరణంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ స్వామి ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని నరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అనంతరం ఎస్సి కాలనీలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని యాప్‌లో నమోదు చేశారు. ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. గత 5 ఏళ్లలో జరిగిన విధ్వంసం, ఆర్థిక లోటును


**ఆర్థిక లోటును పూడ్చుకుంటూ**
**నేడు సంపద సృష్టితో అభివృద్ధి, సంక్షేమం**
**ఏడాదిలోనే ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున**
**సిమెంటు రోడ్ల నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలు**
**పింఛన్లు పెంచాం, ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నాం**
**ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం**
**రైతులకు త్వరలో అన్నదాత సుఖీభవ**
**జగన్ లాగా మేం ప్రజలను మోసం చేయం**
**ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం**
**మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**





పూడ్చుకుంటూ సంపద సృష్టితో అభివృద్ధి, సంక్షేమం చేస్తున్నాం. ఏడాదిలోనే ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున సిమెంటు రోడ్ల నిర్మాణం, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. ఈ ఒక్క గ్రామంలోనే రూ. 55 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేసాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ రూ. 4 వేలకు పెంచాం. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఒక్కొక్కరికి రూ.13 వేలు తల్లి వందనం ఇస్తున్నాం. మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తాం. రైతులకు త్వరలో అన్నధాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ. 20 వేలు అందజేస్తాం. ఇంటి నిర్మాణం కోసం ఎస్సి, బీసీలకు రూ.3 లక్షలు కూటమి ప్రభుత్వం ఇస్తుంది. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నాం. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూ, మరోవైపు రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకు వచ్చి, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. కూటమి ప్రభుత్వం ప్రతిక్షణం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రానున్న రోజుల్లో రాష్ట్ర ముఖ చిత్రం మారనుందని మంత్రి తెలిపారు.

## భూసేకరణపై గ్రామసభ
### తహసిల్దార్ టి శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 2)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉలవపాడు మండలం కరేడు గ్రామం నందు ఇండస్ట్రియల్ హబ్ స్థాపనపై భూసేకరణకు కరేడు గ్రామం సచివాలయం1 నందు జూలై 4వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్రామ సభ నిర్వహించబడుతుందన్నారు. కరేడు గ్రామ ప్రజలు ఈ గ్రామ సభలో పాల్గొని తమ అభిప్రాయం తెలపాలని తహసీల్దార్ టి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## సూర్య ఘర్ పథకం నమోదు పెంచాలి
### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 2)

సూర్య ఘర్ పథకం నమోదు పెంచాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సూర్య ఘర్ పథకం, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలుపై మండల స్థాయి అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. ప్రజలందరికీ సూర్య ఘర్ పథకం కింద సౌర విద్యుత్ అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలను విస్తృతంగా చైతన్య పరచాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక, దరఖాస్తుల నమోదు, రుణ సదుపాయం, యూనిట్ రౌండింగ్ పై సెర్ప్, మెప్మా సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతోనే పురోగతి సాధ్యమన్నారు. చుండూరు, చీరాల, చినగంజాం మండలాల్లో సూర్య ఘర్ పథకం అమలులో పురోగతి సాధించడంపై కలెక్టర్ అభినందించారు. కొరిశపాడు, యద్దనపూడి మండలాలలో పురోగతి తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయడం లేదా అంటూ నిలదీశారు. బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించాలని సూచించారు. యూనిట్లు వేగంగా గ్రౌండింగ్ అయ్యేలా ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారుల వెంట చెత్త లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. నిబంధనల ప్రకారం కాకుండా చెత్తను ఇష్టం వచ్చినట్లు డంపు చేస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చెత్తను కాల్చడం, రహదారుల వెంట చెత్తను డంప్ చేయడం సరైనది కాదన్నారు. నిబంధనల ప్రకారం చెత్త సంపద కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలన్నారు. తడి, పొడి చెత్త విభజించడం ప్రతి ఇంటి వద్ద నుంచే జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. భూమిలో కుళ్లిపోయే చెత్తను వేరుగా, గాజు, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి చెత్త నుంచి సంపద సృష్టించే ప్రక్రియ చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రక్షాళన జరగాలన్నారు. ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని, నిబంధనల ప్రకారం చెత్తను తొలగిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. నిర్లిప్తంగా వ్యవహరిస్తే వారిపై క్రమ శిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఈఓపిఆర్డీలు, సెర్ప్, మెప్మా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన అఖండ సాయి నామ సప్తాహ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 2)

కనిగిరి షిర్డీ సాయిబాబా దేవస్థానంలో బుధవారం నుంచి సాయిబాబా అఖండ సాయి నామ సప్తాహము, గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ అఖండ సాయి నామ సప్తాహము గురుపౌర్ణమి ఉత్సవాలును గౌరవ నీయులైన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి గారు ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డి గారిని సత్కరించి స్వామి వారి ప్రసాదం అందించారు. సాయిబాబా అఖండ జ్యోతి ప్రజ్వలన సాని కొమ్ము రంగనాయకులు రెడ్డి, పద్మావతి దంపతులు చేశారు.సానికొమ్ము మనోహర్ రెడ్డి పద్మ దంపతులు పూజలు నిర్వహించారు. ధనెంకుల తిరుమల రావు, తిరుపాలమ్మ దంపతులు గోపూజ నిర్వహించారు. సాయి భక్తులు మహిళలు వందలాది మంది సాయి నామ సంకీర్తనలతో పట్టణంలోని పలు వీధుల్లో బిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఓం సాయి శ్రీ సాయి అను నామ సంకీర్తన సప్తాహం ఏడు రోజులు పాటు రేయింబవళ్ళు నిరంతరంగా ఆలపిస్తారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం గౌరవ అధ్యక్షులు బోయిళ్ళ తిరుపతి రెడ్డి, కుందురు తిరుపతి రెడ్డి, కమిటీ అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, కార్యదర్శి బాలు ఓబులురెడ్డి , కోశాధికారి ముచ్చర్ల ధర్మారావు, సంయుక్త కార్యదర్శి కొలిపర్తి మారుతి కుమార్, సంయుక్త కోశాధికారి వాగిచెర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు తంగుటూరి గోవింద రావు, మండ్ల వెంకటేశ్వర్లు, వీసీ రామశాస్త్రి, సింగరాజు మాలకొండేశ్వరరావు, ఏసీ చెంచులు, నార్ల పాటి సాంబశివరావు, శ్రీ రాం మురళి, కమిటీ సభ్యులు పాల్వాది జయరాం, మారెళ్ళ ఉమాకాంత్, పల్లా మాలకొండ్రాయుడు, వంటేరు పెద్దన్న, బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మునగా ప్రసాదు, ఇన్నమూరి సుబ్బారావు, కోటయ్య, పుల్లారెడ్డి, చెక్క చెన్నకేశవులు, వేమా రంగ, పైడిమర్రి వెంకటకృష్ణరావు, తదితరులు పాల్గొన్నారు.



## అలగాయపాలెం గ్రామంలో ఇంటింటా టిడిపి







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 2)

మండలంలోని కరేడు పంచాయతీ అలగాయపాలెం ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు అలగాయపాలెం టిడిపి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొడపాటి సుధాకర్ గ్రామ నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యొక్క సమస్యలు అనగా పెన్షన్లు, కరెంటు సమస్య, నీటి సమస్య మొదలైన వాటిని అడిగి తెలుసుకుని వాటిని ఫీడ్ బ్యాక్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పంపడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు, బూతు కన్వీనర్లు, బూతు ఇన్చార్జీలు, క్లస్టర్లు అందరు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఆటో డ్రైవర్స్ యూనియన్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 2)

పాత బస్టాండ్ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గతంలో ఆటో డ్రైవర్‌గా ఉన్న దేవరకొండ నాగరాజు ఇటీవల కాలంలో మరణించగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలనే ఆలోచనతో ఆటో వర్కర్స్ యూనియన్ వారితో మన వారికి మనమే సాయం చేయాలి అని చెప్పి యూనియన్ సభ్యుల నుంచి నగదును వసులు చేసి వారి కుటుంబానికి ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడితో పాటు జిల్లా అధ్యక్షుడు బుచ్చి రాజు, వైస్ ప్రెసిడెంట్ ఎన్ దుర్గారావు,సెక్రటరీ ఏ రామకృష్ణ, ట్రెజరర్ డి వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్ ది కొత్త బెంచ్ మార్క్

**67 లక్షల మందికి తల్లికి వందనం**
**64 లక్షల మందికి భద్రతా పెన్షన్లు**
**అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా పక్క రాష్ట్రాలతో పోటీ**
**ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీల అమలులో మిన్న**
**వైసీపీకి ఇచ్చిన ఒక్క అవకాశంతో పాతికేళ్లు వెనక్కి**
**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 2)**
సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో కొత్త బెంచ్ మార్క్ సెట్ చేసిందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని బల్లికురవలో బుధవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ నిధులతో 16 తోపుడు బళ్లు చిరు వ్యాపారులకు, 8 ట్రై స్కూటీలను దివ్యాంగులైన లబ్ధిదారులకు అందజేశారు. ఆ తరువాత ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంత్రి గొట్టిపాటి పర్యటించారు. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల కాలంలో అందించిన సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలతో మాట్లాడి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలులో చిన్ని చిన్న సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే పరిష్కరించి లబ్ధిదారులకు సత్వర న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సుపరిపాలనకు సంబంధించి సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ కొత్త బెంచ్ మార్క్ సృష్టించిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా వేల కోట్ల రూపాయిలను సంక్షేమానికి ఖర్చు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో రాష్ట్రంలోని 67 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున తల్లికి వందనం అందించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 42 లక్షల మందికి మాత్రమే అమ్మ ఒడి పథకం అందేదని చెప్పారు. అదే విధంగా సామాజిక భద్రతా పెన్షన్ల విషయంలోనూ ఏ రాష్ట్రంలో లేని విధంగా 64 లక్షల మంది లబ్ధిదారులకు ఏడాదికి రూ.34,000 కోట్లు వెచ్చించి పెన్షన్లను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. వెయ్యి రూపాయిలు పెంచడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టిందని మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే రూ.3 వేల పెన్షన్ ను రూ. 4 వేలు చేయడంతో పాటు దివ్యాంగులకు రూ.10 వేలు ఇస్తున్నామని తెలిపారు. పూర్తిగా మంచానికే పరిమితమైన రోగులకు నెలకు రూ.15,000 అందిస్తున్నామన్నారు. దీపం పథకం కింద అర్హులకు మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లను అందిస్తున్నట్లు తెలిపారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోనే ఇప్పటి వరకు సుమారు రూ.50 కోట్లతో రోడ్లు నిర్మించినట్లు వెల్లడించిన మంత్రి గొట్టిపాటి... గ్రామీణ ప్రాంతాల్లోనూ సీసీ రోడ్లతో పాటు తారు రోడ్లు కూడా నిర్మించామన్నారు.

**వేధింపులతో పెట్టుబడిదారుల పరార్..**

ఒక్క అవకాశం అంటూ అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వ చర్యలతో ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి ఆమడ దూరంలో ఆగిపోయిందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం 25 సంవత్సరాలు వెనక్కి పోయిందన్నారు. గత ప్రభుత్వ వేధింపులతో ఎందరో పెట్టుబడిదారులు రాష్ట్రం నుంచి పారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపి తిరిగి పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పెట్టుబడిదారుల్లో మరలా నమ్మకం కలిగించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా యువనేత లోకేష్ అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వ్యాపారవేత్తలకు రాయలసీమ, అనంతపురం వంటి జిల్లాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పెట్టుబడిదారులకు పూర్తి భరోసా కల్పిస్తామని చెప్పారు. దీనితో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు ధీటుగా ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధిలో పోటీ పడే విధంగా చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి వివరించారు. లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి 16,300 టీచర్ పోస్టులను కూడా భర్తీ చేస్తున్నామని తెలిపారు. వీటితో పాటు 20 లక్షల ప్రైవేటు ఉద్యోగాల కల్పనకు కూడా అవసరం అయిన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

**సంక్షేమం, అభివృద్ధి ప్రధాన అజెండాగా....**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ముందుకు వెళుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరించారు. పథకాల అమలు, ప్రజల సంతృప్త స్థాయిలకు సంబంధించి అధికారులు కీలకంగా వ్యవహరించాలన్నారు. గత ప్రభుత్వ విధానాలతో ఆర్థిక వ్యవస్థ కుదేలైనా... ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచితబస్‌తో పాటు మిగిలిన పథకాలనూ త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు అందరికీ క్షేత్ర స్థాయి వరకు పథకాలు అమలయ్యేలా, సంక్షేమ ఫలాలు అందేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ప్రజలకు సహకరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.






# ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తున్నాం

## సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో
## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి







**(షణ్ముఖ వెలుగు, పొదిలి, కొనకనమిట్ల, జులై 2)**
ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా బుధవారం కొనకనమిట్ల మండలంలోని కొనకనమిట్ల గ్రామం, పొదిలి పట్టణంలోని 1వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి పాంప్లేట్లు పంచి బూత్ ఇన్చార్జిలతో మై టిడిపి యాప్‌లో ఆ కుటుంబాల వివరాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని అయినా కూడా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తొలి ఏడాదిలోని తమ హామీలకు కట్టుబడి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని ప్రతి విద్యార్థి తల్లులు ఎకౌంట్లో ఒక్కో విద్యార్థికి పదవులు వేల రూపాయలు జమ చేశారని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో వృద్ధులు వితంతువులకు నెలకు 4000 రూపాయలు, దివ్యాంగులకు 6000 రూపాయలు, కిడ్నీ కాలేయం తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు 10000 రూపాయలు, పూర్తి వైకల్యం ఉన్నవారికి 15వేల రూపాయలు గా మొత్తం గా రాష్ట్రంలో 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు ఇస్తున్నారని అన్నారు. తమ ఎలక్షన్ల హామీ అయినటువంటి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ లు ఇస్తున్నారని అన్నారు. యువతకు 16,347 పోస్టులతో డీఎస్సీ నియామకాలు త్వరలోనే చేపట్టబోతున్నారని, పోలీస్ శాఖలు నియామకాలు జరిపారని, పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల మంది ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగాయని అన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నారని అన్నారు. రైతు సంక్షేమం కొరకు కేంద్రంతోపాటు రాష్ట్ర నిధులు జోడించి అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే ప్రారంభం అవుతుందని అన్నారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం ఐదు రూపాయలకే న్యాయమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రానికి పలు బహుళ జాతి కంపెనీలను తీసుకువచ్చి వేల సంఖ్యలో ఉద్యోగ కల్పన చేశారని అన్నారు. గత వైసిపి పాలకులు పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, ఇంకా 4000 కోట్లు ఖర్చు చేస్తేనే ఆ ప్రాజెక్టు పూర్తి అవుతుందని త్వరలోనే ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. త్వరలోనే ప్రత్యేక మార్కాపురం జిల్లా సకారం చేస్తామని అన్నారు. టిడిపి శ్రేణులు వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తిపి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కుందూరు కాశిరెడ్డి, కొనకనమిట్ల మండల జనరల్ సెక్రటరీ జవ్వాజి భాషాపతి నాయుడు, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), కొనకనమిట్ల యూనిట్ ఇంచార్జ్ మువ్వా కాటంరాజు, చింతకుంట్ల యూనిట్ ఇన్చార్జి శ్రీకాంత్‌రెడ్డి, పొదిలి పట్టణ టీడీపీ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, పొదిలి ప్రతిపాది ఏఎంసి ఛైర్మన్ సయ్యద్ ఇమాంసా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, మాజీ శివాలయం కమిటీ అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఎస్ఎం భాష, ప్రతిపాదిత శివాలయం ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, ఏ అంజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున, యాసీన్, తానికొండ వెంకట్రావు, ఆయా బూత్ ఇన్చార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

# ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తున్న టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 2)**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి వారికి మొదటి ఏడాదిలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో, కందుకూరు నియోజకవర్గంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృధి మరియు సంక్షేమం పనులను వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షుడు క్లస్టర్ యూనిట్ బూత్ లెవెల్ ఇంచార్జ్‌లు , నియోజకవర్గ టిడిపి నాయకులు అనుబంధ విభాగాలు అధ్యక్షులు. సంవత్సర కాలంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి , సంక్షేమాన్ని ప్రజలకు టిడిపి నాయకులు వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లిన టిడిపి నాయకులు వారి యోగక్షేమాలు అడిగి, వారికి అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలు వస్తున్నాయో లేదో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేస్తే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు పార్టీ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్, బూత్ లెవెల్ ఇన్చార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఘనంగా బీద మస్తాన్ రావు జన్మదిన వేడుకలు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)**
ప్రముఖ వ్యాపారవేత్త, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్‌రావు 67వ జన్మదిన వేడుకలు ఒంగోలులో ఘనంగా జరుపుకున్నారు. ద్రావిడ దేశం అధ్యక్షులు వి కృష్ణారావు ఆధ్వర్యంలో ఒంగోలు భాగ్యనగర్ నాలుగవ లైన్‌లో ఉన్న బొమ్మరిల్లు శరణాలయంలో అనాథ విద్యార్థుల సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో కృష్ణారావు కేకు కట్ చేసి మస్తాన్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కృష్ణారావు ప్రసంగిస్తూ మస్తాన్‌రావు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని అదేవిధంగా తాను చేస్తున్న రొయ్యల వ్యాపారంలో ఇంకా బాగా అభివృద్ధి లోకి రావాలని భగవంతుని కోరుకుంటున్నానని ఆకాంక్షను తెలియజేశారు. అదే విధంగా మస్తాన్ రావుని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా గాని లేదా కేంద్ర మంత్రివర్గంలో స్థానం గాని కల్పించాలని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువ నాయకుడు మంత్రి నారా లోకేష్‌ని బిసి వర్గాల తరపున విజ్ఞప్తి చేస్తున్నా అని కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బంకా చిరంజీవి, ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ అధ్యక్షులు చిరుమామిళ్ల గోపికృష్ణ యాదవ్, యాదవ ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్యక్షుడు మల్లిబోయిన రాజు యాదవ్, నాగం వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆముదాలపల్లి, అన్నవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 2)

పొదిలి మండలంలోని ఆముదాలపల్లి, అన్నవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ కి సంబందించి ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలు అయినటువంటి జీలుగ,జనుము 50% రాయితీ పై రైతులకు అందుబాటులో ఉన్నాయని కావల్సినటువంటి రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకొని వినియోగించుకోవాలని ఆయన రైతులని కోరారు. రైతులు మట్టి పరీక్షలు చేయించుకొని ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడుకోవాలని తెలిపారు. మండల ఉద్యానవన శాఖ అధికారి(ఇంచార్జి) బి.ధనలక్ష్మి గారు మాట్లాడుతూ ఉద్యానవన శాఖలో ఉన్నటువంటి పథకాల గురించి తెలియజేశారు. కొత్తగా కూరగాయలు సాగు చేసుకుంటే వాళ్ళకి ఒక హెక్టార్ కి రూ.24,000 సబ్సిడీ వస్తుంది అన్నారు అదేవిధంగా పూల సాగుకు ఒక హెక్టార్ కి రూ.20,000 రాయితీ వస్తుందని తెలియజేశారు. పసు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బి.నర్మద ఆ గ్రామాల రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీగిరిలో ఘనంగా ప్రారంభమైన అభయాంజనేయ స్వామి

**ఆగమన ఆరాధన ఉత్సవాలు**

**భక్తిశ్రద్ధలతో చాలీసా పారాయణ**

**అన్నమయ్య సంకీర్తనలతో అలరించిన వినోద్ కుమార్**







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పరిపాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీగిరి క్షేత్రపాలకుడు అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధన ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి వారికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారి ఊంజల సేవ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వి వి ఎస్ వినోద్ కుమార్ అన్నమయ్య సంకీర్తనలతో భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీ వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారిలతో పాటు ఆలూరు జై శంకర్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. శ్రీగిరి నిర్వాహకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధన ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం హనుమద్ యాగం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం ఏడు గంటలకు విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతుంది. భక్తులు పై కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)

**ఫెడరలిజాన్ని కాపాడుకునేందుకు రాజ్యాంగ శక్తులు ఏకం కావాలి**

**రాజ్యాంగ హక్కులను కాపాడుకునేందుకు**

**కార్మిక కర్షక ఉద్యోగ ఉపాధ్యాయ శక్తులు ఐక్యం కావాలి**

**ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్గాల సదస్సులో**

**శాసనమండలి మాజీ సభ్యులు కేఎస్ లక్ష్మణరావు**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు విశాల మద్దతును కూడగట్టాలని శాసనమండలి మాజీ సభ్యులు కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం యుటిఎఫ్ భవన్ లో జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక,పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్గాల సదస్సు లో ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఎల్ఐసి యూనియన్ నాయకులు పారా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వ రంగం దేశాభివృద్ధికి పునాదిగా సాగిందని,ప్రభుత్వ రంగం ద్వారా ప్రజలకు కావలసిన పునాదిని ఏర్పాటు చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కారణంగానే 1970 కాలంలో ఒక్క హైదరాబాద్ నగరంలోనే 50 రకాల ప్రభుత్వ పరిశ్రమలు ఏర్పడినట్లు గుర్తు చేశారు. 1990 ఆర్థిక సంస్కరణల అమలులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వాలు ప్రైవేటీకరణ గావిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఆంధ్రుల హక్కు విశాఖ హక్కు పేరుతో 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కున సైతం ప్రైవేటీకరించేందుకు కేంద్రం యోచిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారపక్షంలోని టిడిపి,జనసేన, వైసిపి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తామని ప్రకటించలేకపోతున్నట్లు విమర్శించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయించకుండా ప్రైవేట్ కంపెనీలకు ధారా దత్తం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందని ఆరోపించారు. ఉక్కు పరిశ్రమ కారణంగా విశాఖపట్నం అభివృద్ధి చెందిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.విశాఖఉక్కు పరిరక్షణకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాగా అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలవల్ల కనీస వేతనం పనిగంటలు గ్రాట్యూటీ వంటి ప్రయోజనాలు సాధించుకోగా. ఆ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను అమలుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహం పన్నుతుందన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలు చేస్తే ఉద్యోగులు కార్మికుల భవిష్యత్తు అంధకారం కానుందని పేర్కొన్నారు. లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక విశాల మద్దత్తు కూడగట్టి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఏడవ వేతన సంఘం సిఫార్సుల మేరకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో 1.05 లక్షల మంది అంగన్వాడీలు,2 లక్షల మంది ఔట్సోర్సు ఉద్యోగులు, 70 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలన్న నిబంధనను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్ తరువాత అమలులోకి వచ్చిన సిపిఎస్ ను రద్దు చేయాలన్నారు, జగన్ ప్రభుత్వం ప్రతిపాదించిన జిపిఎస్, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన యుపిఎస్ స్థానంలో ఓ పి ఎస్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎడిషన్ క్వాంటం రద్దును ఉపసంహరించి అమలు పరచాలని, ఓ పి ఎస్ అమలులో ఉన్నవారికి పి అర్ సి,డి ఏ లు రద్దు యోచన ఉపసంహరి ంచుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి ఎన్నికల హామీ మేరకు 12వ పిఆర్సి కమిటీని నియమించాలని, 11వ పిఆర్సి బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మిర్చి,పొగాకు సెనగ వంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని. రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల సమస్యలకు ఉద్యోగ, కార్మికులు అండగా నిలవాలని సూచించారు. రాష్ట్రాల హక్కులపై కేంద్రం చేస్తున్న దాడులను ఈ సందర్భంగా ఖండించారు. కాగా బిజెపి యేతర రాష్ట్రాల్లో ఫెడరలిజాన్ని దెబ్బతీస్తూ కేంద్రం చేస్తున్న చర్యలను ఆయన తప్పు పట్టారు. మతం పేరుతో, ప్రాంతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతుందని ఆయన దుయ్య బట్టారు. రాష్ట్రం లో మూడు ప్రాంతీయ పార్టీలు బిజెపి కి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ఎన్టీ రామారావు నేషనల్ ఫ్రంట్ చైర్మన్ గా ఫెడరలిజం స్ఫూర్తిని కాపాడుకునేందుకు ఇందిరా గాంధీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి, రాష్ట్రాల హక్కులను కాపాడిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే విధంగా బిల్లుల ఆమోదం విషయంలో తమిళనాడు గవర్నర్ చర్యలను సుప్రీం కోర్ట్ తప్పుపట్టిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత 30 ఏళ్లుగా ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటికరణ గావిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జులై 9 న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, కర్షక విశాల ఐక్యతను కూడగట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు, ప్రైవేటికరణను అడ్డుకునేందుకు, కార్మికుల హక్కులు కాపాడుకునేందుకు, కనీస వేతనాల సాధనకు చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సదస్సు లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జీవి కొండారెడ్డి, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏవి పుల్లారావు, మెడికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తాళ్లూరు వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు, బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు బాబురావు, సిఐటియు నగర అధ్యక్షులు టి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలి

**వైసీపీ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ డిమాండ్**



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 2)

కరేడు వ్యవసాయ భూములను ఇండో సోలార్ కంపెనీకి 8500 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం బలవంత భూ సేకరణ చేస్తుందని దీనిని తక్షణమే ఆపాలని కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పత్రికా విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఇప్పటికే కరేడు పంచాయతీ పరిసరాలలో సుమారు 4000 ఎకరాలు భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రాథమికంగా పోయిన నెల 19వ తేదీన 940 ఎకరాలకు కరేడు గ్రామం మందలి భూములు అవసరమైనవి అని అందులో 165 కుటుంబాలు తొలగించాలని జీవో విడుదల చేశారు.కరేడు గ్రామపంచాయతీ రైతులు ఇంటి నివేశనదారులు ఎటువంటి పరిస్థితులలో భూములు యివ్వం అంటున్నారు.గ్రామ ప్రజలు భావనను అంగీకరించి ప్రభుత్వం భూసేకరణను విరమించుకోవాలి. కరేడు రైతులు పోరాటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుంది. ఇండో సోలార్ ప్రాజెక్టుకు ఒప్పందం వరకు ఎన్ని ఎకరాల భూములు కావాలో ఆ ఒప్పందమును ప్రభుత్వం బయట పెట్టాలి. రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూములు, వేరుశెనగ జామాయిలు కూరగాయలు మామిడి పచ్చని పంట పొలాలు సారవంతమైన భూములు తీసుకోకుండా ప్రభుత్వం పునరాలోచన చేయాలి అని డిమాండ్ చేస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కరేడు రైతులకు అన్యాయం జరగనివ్వను అని బీరాలు పలుకుతున్నారు రైతుల భూములను ఎవరు సేకరిస్తున్నారు? రైతులకు ఎటువంటి ముందస్తు సమాచారం నోటీసులు ఇవ్వకుండా గ్రామ సభలు నిర్వహించకుండా రైతుల అభిప్రాయం సేకరించకుండా భూములు తీసుకోవడం బలవంత సేకరణ కాదా! ఇప్పటికైనా రైతులు అభిప్రాయాన్ని గౌరవించి భూములు సేకరణను ఆపాలన్నారు. రైతులు మా భూములు అసలు ఇవ్వం అంటుంటే ఎమ్మెల్యే పరిహారం గురించి మాట్లాడటం హాస్యాస్పదం కాదా! గత ప్రభుత్వం హయాంలోని సోలార్ ప్రాజెక్టు కోసం భూమిని కేటాయించటం దానికి సంబంధించి ఆ కంపెనీ డబ్బులు కూడా చెల్లించటం జరిగినది. భూమిని కేటాయించిన ప్రాంతంలోనే 20 ఎకరాలలో సోలార్ నిర్మాణాలకు కూడా మొదలుపెట్టినది. కరేడు గ్రామంలో దాదాపు 8500 ఎకరాలు సేకరిస్తామంటూ కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం విడ్డూరంగా ఉంది. చేవూరు రావూరు పొలం 100 ఎకరాలు మాత్రమే ఇచ్చి బీపీసీఎల్ కి భూములు కావాలనే ఉద్దేశంతో హిందూ సోలార్ను కరేడు ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇలా పంపించి రైతుల్లో ప్రజల్లో అలజడి రేకెత్తిస్తున్నారు. రైతు ఉద్యమ సందర్భంగా రైతులు మీద బనాయించిన కేసులను తక్షణమే ఎత్తివేయాలి అని డిమాండ్ చేస్తున్నాము. ప్రాజెక్టుల పేరు తోటి రైతులను ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు. షిరిడి సాయి కి ఇదివరకే భూములు కేటాయించారు వారికి కేటాయించిన భూములు వారికే ఇవ్వాలని మిగిలిన పరిశ్రమలకు న్యాయబద్ధంగా చట్టబద్ధంగా చాలా చోట్ల భూములు ఉన్నాయి అక్కడ కేటాయించాలని కోరుతున్నాము. మత్స్యకారుల జీవనోపాధి కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది. కాలుష్యం వలన మత్స్య సంపద అంతరిస్తుంది అని అన్నారు. విలేకరులవిలేకరుల సమావేశంలో కరేడు జడ్పిటిసి చేవూరి శ్రీనివాసులు, ఎంపీటీసీ పోకూరి వినయ్, ఎంపీటీసీ 2 ఏ వెంకట రమణయ్య కరేడు రైతులు బందుల సుందరరామిరెడ్డి, బొమ్మిరెడ్డి శరభారెడ్డి, మేకన పోయిన చెంచయ్య, రామాల కృష్ణారెడ్డి, బొమ్మిరెడ్డి పవన్ కుమార్ రెడ్డి, దగ్గుమాటి సుబ్బరామిరెడ్డి (కరేడు గ్రామ పార్టీ అధ్యక్షుడు) జి చిన్న నాంచార్లు, పి భాస్కర్ కరేటి కోటేశ్వరరావు, బొడ్డు శ్రీధర్‌రెడ్డి, తెల్లపాటి కృష్ణ, చినిగే శ్రీనివాసులు, ఆలుచూరి రవీంద్రారెడ్డి మండల అధ్యక్షులు నన్నెం పోతురాజు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, నలమోతు చంద్రమౌళి, చీమల వెంకట రాజా, అప్పనబోయిన రాజేష్, బిల్లా రమణయ్య, దగ్గుమాటి కోటయ్య, కాపులూరి మధుసూదన్, తాటిపర్తి రమేష్, విగ్నేష్, అబ్దుల్ కలాం, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పొర్లుదండాలు పెట్టినా ప్రజలు మళ్లీ నమ్మరు

**వైకాపా రౌడీ, గుండారాజ్యాలకు కాలం చెల్లిందని**

**జగన్ ఇకనైనా గుర్తించాలి**

**కనమర్లపూడిలో సుపరిపాలనలో తొలిఅడుగు**

**కార్యక్రమంలో జీవీ, మక్కెన**







(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 2)

రాష్ట్రంలో జగన్ మళ్లీ పాదయాత్రలు కాదుకదా పొర్లు దండాలు పెట్టినా ప్రజలు అతడిని నమ్మే పరిస్థితుల్లో లేరని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. చంపండి, నరకండి, కాల్చండి అంటూ యువతను తప్పుదోవ పట్టించాలని, పరిశ్రమలు రాకుం డా చేయాలని బెదిరింపులతో భయభ్రాంతులకు గురిచేయాలన్నదే అతడి కుయుక్తులుగా కనిపి స్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. వీటన్నింటికంటే ముందు ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా రౌడీ, గుండారాజ్యాలకు కాలం చెల్లిందని జగన్ ఇకనైనా గుర్తించాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా శావల్యాపురం మండలం కనమర్లపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల అభిప్రాయాలతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఫోన్‌లను గన్ లనుగా వాడాలంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. అయిదేళ్లు అవకాశం ఇస్తే జనా న్ని నిలువునా ముంచినా, రాష్ట్రాన్ని రావణకాష్ఠం చేసింది చాలక మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలతో యువతకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. రప్పారప్పా, గన్‌లంటూ రెచ్చగొట్టే వ్యాఖ్య లతో సమాజంలో ప్రశాంతతను దెబ్బతీయాలన్నదే వారి కుట్రగా కనిపిస్తోందన్నారు. రౌడీయి జం, గుండాయిజాన్ని పోషించడం, గంజాయి, గుట్కాలతో యువతను తప్పుదోవ పట్టించింది చాలా మళ్లీ ఏం చేద్దామంటున్నారని పాదయాత్ర అంటున్నారో సమాధానం చెప్పాలన్నారు. సూపర్‌సిక్స్‌లో తొలి ఏడాదిలోనే 5హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది అన్న జీవీ రూ.10లక్షల కోట్ల పెట్టుబడులతో 8.5 లక్షలమందికి ఉద్యోగాలు కల్పిస్తున్న విషయం అతడి కళ్లకు కనిపించడం లేదా అని తూర్పారా బట్టారు. ఇదే జగన్ హామీల అమల్లో 99శాతం ఫెయిల్ అయిన విషయం కూడా మరిచివపోద్దని చురకలు వేశారు. ప్రజల ఆకాంక్షల కూటమి ప్రభుత్వం నెరవేర్చింది కాబట్టే అందరు సంతోషంగా ఉన్నారని తెలిపారు. యువత గంజాయి, గుట్కా వదిలేసి ఉద్యోగాల్లో ముందుకు వెళ్తున్నారని, పదిలక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ముంచేసి మీరెక్కడ? ఏడాదిలో అంచ నాలకు మించిన సంక్షేమ పథకాలు అందించిన కూటమి ప్రభుత్వం ఎక్కడ? అనేది ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, నాయకులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వ్యవస్థలను సర్వనాశనం చేసింది వైసీపీనే..!




### వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది
### నా మొదటి సంతకం కూడా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు పైనే
### రాష్ట్రంలో దళారులే లేని ఏకైక మార్కెటింగ్ యార్డు అద్దంకి
### ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 2)

అద్దంకి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగా కొలువు తీరిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కమిటీ సభ్యులకు మంత్రి గొట్టిపాటి అభినందనలు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో ఏర్పడిన అద్దంకి మార్కెటింగ్ కమిటి పని తీరును మంత్రి గొట్టిపాటి కొనియాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునేలా రైతులకు గత మార్కెటింగ్ కమిటీ సౌకర్యాలు కల్పించిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 220 పైగా వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉంటే రైతులు పండించిన కూరగాయలను, పంటను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్ముకునే సౌకర్యం కల్పించామని అన్నారు. రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు వస్తే వారి నుంచి కూడా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తెలిపారు. అయితే నేడు కొత్తగా కొలువు తీరిన కమిటీ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆకాంక్షించారు. అద్దంకి మార్కెటింగ్ యార్డ్ సుమారు 13 ఎకరాల్లో ఉందన్న మంత్రి... మార్కెటింగ్ యార్డుకు కూడా ఆదాయం చేకూరేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గతంలో మాదిరిగానే అద్దంకి మార్కెటింగ్ యార్డుకు పూర్వ వైభవం తీసుకు రావాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అన్నీ వ్యవస్థలను సర్వనాశనం చేసినట్లే.. మార్కెటింగ్ యార్డులను కూడా నాశనం చేసిందని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు సంబంధించిన పనిముట్లను, వ్యవసాయ పరికరాలను, డ్రిప్ సిస్టమ్ ను అందించలేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తుందని తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పరిచయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి రెండు డ్రోన్లను కేటాయించినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టేటప్పుడు తొలి సంతకం రైతులకు 45 వేలు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు పైనే చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కొరిశపాడు మండలం పి. గుడిపాడు గ్రామంలో ఉద్యానవన పంటలను మంత్రి నారా లోకేశ్ కూడా పరిశీలించడం జరిగిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.

ఉద్యానవన పంటలకు పెద్ద ఎత్తున సబ్సిడీ ఇచ్చి కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. అయితే నేడు ఉద్యానవన పంటలకు నిలయమైన పి. గుడిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి చైర్మన్ కావడం సంతోషమని అన్నారు. త్వరలోనే పి గుడిపాడు గ్రామంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గం వ్యాప్తంగా పెద్ద ఎత్తున కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అద్దంకి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా ఓవర్ ట్యాంకుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు.






# నిబంధనలను తుంగలో తొక్కిన విద్యాశాఖ అధికారులు

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 2)

ప్రభుత్వ పాఠశాలల విలీన కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు నియమ,నిబంధనలు పాటించకుండా వారి ఇష్టానుసారంగా విలీనం చేశారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ఆరోపించారు. బుధవారం మండలంలోని రసీదుపురం స్కూల్ నందు విద్యార్థిని, విద్యార్థులు వీరి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కూల్ కమిటీ తీర్మానం ఆమోదంతో ఒక కిలో మీటర్ లోపు ఉన్నటువంటి స్కూళ్లకు విద్యార్థిని విద్యార్థులు తక్కువ సంఖ్య ఉన్న స్కూళ్లను ఎక్కువ సంఖ్య ఉన్న స్కూల్లో విలీనానికి విద్యా కమిటీ చైర్మన్ ఆమోదంతో ప్రతిపాదన పంపాల్సి ఉండగా ఎక్కడా కూడా ఈ నిబంధనలు అమలు జరగలేదు అన్నారు కొండారెడ్డిపల్లి మాదిగ పాలెం స్కూల్ నుండి కోటతిప్పల స్కూలుకు నాలుగు కిలోమీటర్లు దూరం ఉందని ఇక్కడనుండి 18 మంది విద్యార్థులను కొండారెడ్డి పల్లె జనరల్ నుండి కోట తిప్పల స్కూలుకు రెండు కిలోమీటర్లు ఉందని ఇక్కడ నుండి ఎనిమిది మంది విద్యార్థులను రసీదుపురం మాదిగ పాలెం నుండి 2.2 కిలోమీటర్లు దూరం ఉందని ఇక్కడ నుండి 18 మంది విద్యార్థులలోనూ 3 నుంచి 5 తరగతి చదువుతున్నటువంటి వారిని 12 మంది ఉన్నటువంటి కోట తిప్పల గ్రామానికి విలీనం చేయటం ఏ నిబంధన కింద వర్తిస్తుందని ప్రశ్నించారు. వాస్తవంగా ఇలా విలీనం చేస్తే రసీదుపురంలో వీరందరిని డంప్ చేయాలని దళితవాడలో బడి ఉంది కాబట్టి ఇక్కడ విలీనానికి అధికారులు వివక్ష చూపారన్నారు దూరాన్ని పరిగణనవి తీసుకున్నప్పుడు ఈ స్కూలు ఏవి కూడా విలీనం చేయటానికి సాధ్యపడదని తెలిపారు అయినప్పటికీ ఎవరు మెప్పు కోసమో చేశారు చేసిన వ్యక్తులకు తెలియాలని నిరసన వ్యక్తపరిచారు ప్రతిరోజు నాలుగు నుంచి ఎనిమిది కిలోమీటర్లు మూడో తరగతి చదివే విద్యార్థి తన బరువైన  పుస్తకాల బ్యాగులు వేసుకొని రోజువారీ స్కూలుకు వెళ్లటం సాధ్యసాధ్యాలను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు కేవలం పేదలకు చదువును దూరం చేయాలనే దురుద్దేశంతో ప్రైవేటు విద్యావ్యవస్థను ప్రోత్సహించాలనేటువంటి ప్రభుత్వ ఆలోచనను ఇక్కడ అమలు చేశారని వివరించారు మార్గమధ్యలో అనేక వాగులు వర్షాకాలంలో ప్రమాదకరంగా మారుతున్నాయని కోతులు పెద్దల మీద సైతం చేతులు బ్యాగు ఉంటే దాడి చేసి బ్యాగులు తీసుకెళ్తున్నాయని ఇలాంటి స్థితిలో చిన్న పిల్లల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు మద్యం సేవించి రోడ్ల పక్కన బ్రిడ్జిల పక్కన కొంతమంది ఆకతాయిలు కూర్చొని ఉంటున్నారని ఆడపిల్లలు ఇలాంటి పరిస్థితుల్లో నడుచుకుంటూ ఒంటరిగా వెళితే వీరికి రక్షణ ఎక్కడ ఉండండి వస్తుంది అని తెలిపారు ప్రభుత్వం విలీనంపై పునరాలోచించాలని ఈ సందర్భంగా వీరు డిమాండ్ చేశారు గ్రామంలో చర్చి సెంటర్ నుండి పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం పాఠశాల ఎదుట ధర్నా చేశారు ఈ ధర్నాలు కోలా యేసు మాట్లాడుతూ కనీస మాట కూడా చెప్పకుండా మమ్ములను అధికారులు మోసం చేశారని ఆవేదన వ్యక్తపరిచారు. ముళ్లపాటి చిన్నమ్మి మాట్లాడితే నాకు ఆడబిడ్డలు మంచి చెడులు చూసేవారు లేరు నేను కూలికి పోతేనే ముందు గడవాలి నా బిడ్డలను వదల పంపించి నేను పనికి పోవడం సాధ్యపడేదాన అని ప్రశ్నించాడు. ఆడపిల్లలకు జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అని అడిగారు. కోళ్ల చిన్న సుందర రావు మాట్లాడుతూ ప్రభుత్వానికి చేతులు ఎత్తి దండం పెడుతున్నా దయచేసి విలీనం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులతో పాటు వీరి తల్లిదండ్రులు గ్రామ పెద్దలైన గుంటి యేసేపు పరిస్థితి సుందర్రావు, గుంటి సాల్మన్, గుంటి బోయేజు, పరిశిపోగా రోణం, గుంటి అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.




# ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తున్నాం

## ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)

ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తున్నామని సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మద్దిపాడు గ్రామ బీసీ కాలనిలో సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి ఇంటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన సంక్షేమ కర పత్రాలను ప్రజలకు అందించారు. బీసీ కాలని ప్రజలు అంగన్‌వాడి స్కూల్ రిపేర్, సైడ్ డ్రైన్స్ లను, ఎంపీపీ స్కూల్‌కు సంబంధించిన సమస్యల గురించి ఎమ్మెల్యేకి తెలియజేసారు. వాటిని త్వరలో పూర్తి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.   ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, మండవ జయంత్ బాబు, పోతినేని శ్రీనివాసరావు(పిఎస్ఆర్), మండల జనసేన పార్టీ అధ్యక్షులు నున్న బాలసుబ్రమణ్యం, బీజేపీ అధ్యక్షులు రమణ, గ్రామ పార్టీ అధ్యక్షులు రఘు, యూనిట్ నువ్వుల శివ కృష్ణ , మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





# ఉరించి...ఊసూరుమనిపించి...

### నిర్ణయం తీసుకోని అధికారిక కమిటీ
### త్వరలో మరొసారి భేటి...చివరి నిర్ణయం అప్పుడే...!
### పట్టణంలో హట్ టాఫిక్ గా ముస్లిం వక్ఫ్‌బోర్డు ఆక్రమిత స్థలాల విషయం
### మీడియాకు వివరాలు చెప్పడానికి నిరాకరించిన ఆర్డిఓ
### అధికారుల పరిశీలించిన అనంతరం
### అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణదారులు






(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 2)

ప్రకాశం జిల్లా  పొదిలి పట్టణంలో వక్ఫ్ బోర్డు స్థలాల ఆక్రమణ విషయం పట్టణంలో ఇటివల హాట్ టాఫిక్ గా మారింది. వక్ఫ్‌బోర్డు ఆక్రమిత స్థలాల పై కమిటీ ఆక్రమణలు తొలగించాలని న్యాయస్థానం, ఇటు అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తునే ఉన్నారు. కాని అడుగులు ముందుకు పడటం లేదు. ఈ క్రమంలో కనిగిరి ఆర్డిఓ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటి సమావేశం బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగింది. అధికారులు, వక్ఫ్ బోర్డు కమీటీ సిబ్బంది ఆక్రమిత ప్రాంతాలను సందర్శించటంతో ఈ సారైన నిర్ణయం తీసుకుంటారని ఆశించారు. కాని ఆశ నిరాశ అయింది. కమిటి ఆధ్వర్యంలో ఆర్డిఓ పరిశీలన చేసారు గాని నిర్ణయం తీసుకొలేకపోయారు. మరోసారి మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, ట్రాన్స్‌కో, వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో కమీటి సమవేశమై తుది నిర్ణయం తీసుకుని చర్యలు తీసుకుంటారని సమాచారం. ముస్లిం వక్ఫ్‌బోర్డ్ ప్రతినిధి దీని పై త్వరలో అధికారులతో సమావేశమౌతమని తెలిపారు. ఆర్డీఓ మాత్రం మీడియాతో మాట్లాడేందుకు సుముఖత చూపలేదు. మరో వింతేమంటే అధికారులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వక్ఫ్‌బోర్డు స్థలాలను పరిశీలించారు. అధికారుల పరిశీలన అయిపోయిన పిదప ఆక్రమణదారులు దర్జాగా నిర్మాణాలు చేపట్టారంటే అధికారుల పరిశీలన ఎంతో లోపభూయిష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



## సాయిబాబా దేవస్థానంలో ప్రత్యేక పూజలు

**"అఖండ జ్యోతి" వెలిగించిన సానికొమ్ము రంగనాయకులురెడ్డి పద్మావతి దంపతులు**



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 2)
కనిగిరి సాయిబాబా దేవస్థానంలో బుధవారం అఖండ సాయి నామ సప్తహము, గురు పౌర్ణమి మహోత్సవం సందర్భంగా సానికొమ్ము రంగనాయకులు రెడ్డి పద్మావతి దంపతులు ఉదయం 7 గంటలకు "అఖండ జ్యోతి" వెలిగించి, అనంతరం తమ్ముడు సానికొమ్ము రామ మనోహర్ రెడ్డి పద్మ దంపతులతో కలిసి పూజలు చేశారు. అఖండ సాయి నామ సప్తాహం 7 రోజులు నిరంతరం (రాత్రి పగలు) జరుగుతుందన్నారు. అనంతర ధనేం కుల తిరుమలరావు తిరుపాలమ్మ దంపతులు గోపూజ చేశారు.

## తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలి డిప్యుటీ ఎంపీడీఓ షేక్ నాగూర్ వలి




(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జులై 2)
గ్రామాలలోని ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని డిప్యూటీ ఎంపిడిఓ షేక్ నాగూర్ వలి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కూచిపూడి గ్రామంలో ఇల్లు ఇల్లు తిరుగుతూ తడి చెత్త, పొడి చెత్త పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలి

**స్వర్ణాంధ్ర విజన్ పై మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సమీక్ష**






(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 2)
స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 పై బుధవారం తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ సభ్యులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. అన్ని రంగాల్లోనూ వృద్ధి రేటు 15 శాతం సాధించేందుకు లక్ష్యం మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా పరిశ్రమలు, ఉద్యాన, వ్యవసాయ రంగాల్లోనూ చక్కని పురోగతి సాధించేందుకు అవకాశం ఉందన్నారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని, ఆ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి కోరారు.

# మంగళగిరిలో మంత్రి లోకేశ్ కు ఆత్మీయ స్వాగతం పలికిన ప్రజలు

**మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ కొత్త కార్యక్రమం**
**'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో శ్రీకారం**
**ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ విజయాల ప్రచారం**
**సీతానగరంలో రిటైనింగ్ వాల్ పనుల పరిశీలన**
**రూ.295 కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మాణం**
**వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారమని వెల్లడి**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)
రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం తన నియోజకవర్గమైన మంగళగిరిలో పర్యటించారు. తాడేపల్లి పట్టణంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' అనే పేరుతో ఒక నూతన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, నాయకులు మంత్రికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా, లోకేశ్ తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగారు. స్థానిక ప్రజలను నేరుగా కలుసుకుని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వారికి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. అనంతరం, తన పర్యటనలో భాగంగా తాడేపల్లి మండలం సీతానగరం వద్ద కృష్ణా నది కరకట్ట వెంబడి నిర్మించ తలపెట్టిన రిటైనింగ్ వాల్ పనులను మంత్రి లోకేశ్ పరిశీలించారు. సుమారు రూ.295 కోట్ల అంచనా వ్యయంతో ఈ కీలకమైన ప్రాజెక్టును చేపడుతున్నట్లు అధికారులు ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణం సీతానగరం, పరిసర ప్రాంతాల ప్రజల చిరకాల స్వప్నమని అన్నారు. ప్రతి ఏటా వరదల సమయంలో కృష్ణా నదికి భారీగా నీరు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ వాల్ నిర్మిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్మాణంతో స్థానికులకు వరద ముప్పు పూర్తిగా తప్పుతుందని లోకేశ్ భరోసా ఇచ్చారు. దీనిపై ఆయన సోషల్ మీడియాలోనూ స్పందించారు.
"కూటమి ప్రభుత్వ ఏడాది పాలనను పురస్కరించుకుని మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని మహానాడు కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలో- తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నాను. ఇంటింటికీ తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాను. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశాను. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చాను" అని వివరించారు.





## చైనాకు షాకిచ్చిన దలైలామా.. డ్రాగన్‌కు ఆ అధికారం లేదని ప్రకటన..

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)



టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామాతాజాగా చైనాకు షాక్ ఇచ్చారు. 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..? అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. స్పందించిన వారిలో టిబెట్ మతపెద్దలు, చైనాలోని వారు కూడా ఉన్నట్లు వెల్లడించారు. తన వారసత్వం భవిష్యత్తులో కొనసాగాలని వారంతా కోరుకున్నట్లు తెలిపారు. తన వారసత్వం కొనసాగాలా, వద్దా అనే విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారని తాను 1969లోనే వెల్లడించినట్లు దలైలామా పేర్కొన్నారు. తాజా అభిప్రాయాల ఆధారంగా గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్ మాత్రమే దలైలామా పునర్జన్మను నిర్ణయిస్తుందని.. ఈ ప్రక్రియలో మరెవరికీ జోక్యం చేసుకొనే అధికారం లేదని తేల్చిచెప్పారు. చాలా ఏళ్ల క్రితం దలైలామా ఒక దశలో తనతోనే ఈ సంప్రదాయం ముగిసిపోతుందని ఆందోళన చెందారు. కానీ, ఆ తర్వాత తన పునర్జన్మ టిబెట్ బయట జరగొచ్చని చెప్పారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే కీలుబొమ్మను దలైలామా వారసుడిగా ఎంపిక చేయాలని చైనా ఎప్పటినుంచో ఉబలాటపడుతోంది. ఆ ప్రాంతాన్ని 1950లో ఆక్రమించిన చైనా- ఆ తరవాత దాన్ని తన భూభాగంలోకి మార్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా చైనీస్ మూలాలున్న హన్ జాతి ప్రజలు ఇబ్బడిముబ్బడిగా టిబెట్‌లో స్థిరపడేలా చేసింది. ఆక్రమణ తరవాత లక్షల సంఖ్యలో అక్కడి చిన్నారులను దూర ప్రాంతాలకు తరలించి వారికి బ్రెయిన్ వాష్ చేసింది. అక్కడి పీఠభూమిలో విస్తారంగా బొగ్గు, రాగి, క్రోమియం, లిథియం, జింక్, సీసం, బోరాన్ నిక్షేపాలు ఉండడంతో వాటిపైనా చైనా కన్నేసింది. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావించింది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని (పునర్జన్మ పొందిన బాలుడిని) ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

**దలైలామా వారసుడికి బీజింగ్ ఆమోదం ఉండాలి: చైనా**

దలైలామా వారసుడికి కచ్చితంగా తమ ఆమోదముద్ర ఉండాల్సిందేనని చైనా బుధవారం ప్రకటించింది. ఈమేరకు ఆ దేశ విదేశాంగశాఖ ప్రతినిధి మావోనింగ్ ప్రకటన విడుదల చేశారు. పైగా వారసుడి గుర్తింపు కార్యక్రమాన్ని చైనాలోనే పురాతన విధానాలను అనుసరించి నిర్వహించాలన్నారు.

## బానిసత్వం కంటే చీకటి గదిలోనే ఉంటా - ఇమ్రాన్ ఖాన్

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,జూలై 02)



పాకిస్థాన్ పాలకులు నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నారని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల పార్లమెంటు చేసిన ఓ చట్ట సవరణను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో స్పందించిన ఆయన.. ఈ బానిసత్వాన్ని అంగీకరించడానికి బదులు జైల్లో చీకటి గదిలో జీవించడానికి ఇష్టపడతానని అన్నారు. తన సందేశాన్ని ప్రజలకు చేరకుండా ప్రభుత్వం అన్నివిధాలా అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని తన మద్దతుదారులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.
"ప్రజాస్వామ్యంలో నాలుగు అంశాలకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఓటుహక్కు, చట్టబద్ధ పాలన, నైతికత, స్వేచ్ఛాయుత మీడియా. ఇటీవల చేసిన ఇరవై ఆరవ రాజ్యాంగ సవరణ వీటన్నింటినీ నాశనం చేసింది. జులై 6 తర్వాత.. ఈ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా పోరాడాలని దేశం మొత్తానికి ముఖ్యంగా పీటీఐ కార్యకర్తలకు, మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఈ బానిసత్వాన్ని అంగీకరించడం కంటే జైల్లో చీకటి గదిలోనే జీవిస్తా" అని ఇమ్రాన్ పేర్కొన్నారు. తన సందేశాన్ని ప్రజలకు చేరకుండా ప్రభుత్వం అన్నివిధాలా అడ్డుకుంటోందన్నారు.

**నియంత అధికారంలోకి వస్తే..**

పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పైనా ఇమ్రాన్ ఖాన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఓ నియంత అధికారంలోకి వస్తే.. అతడికి ఓట్లు అవసరం లేదని, ట్రయల్-అండ్-ఎర్రర్ పద్ధతిలో పాలన కొనసాగిస్తాడని విమర్శించారు. అక్కడి న్యాయవ్యవస్థపైనా మాజీ ప్రధాని మాట్లాడారు. కోర్టుల్లో 'ఎంపిక చేసిన' న్యాయమూర్తులే ఉంటున్నారని.. స్వతంత్రంగా వ్యవహరించే వాళ్లు శక్తిహీనులుగా మారిపోతున్నారని అన్నారు. దేశంలో వాక్ స్వాతంత్ర్యం కనుమరుగవుతోందన్న ఇమ్రాన్.. నిజాయతీ గల జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.
పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అనేక కేసులు ఎదుర్కొంటున్నారు. 2023 మే 9న ఆయన అరెస్టు అనంతరం లాహోర్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపైనా అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఆగస్టు 2023 నుంచి జైల్లో ఉంటున్న ఆయన.. బెయిల్ కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ చుక్కెదురు అవుతోంది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com